ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

ఫీలవ్వడమా... అదొకప్పటి మాట

క్యాంపస్ ఛాట్



ఆవిరిశక్తి... పారిశ్రామిక విప్లవం

టర్నింగ్ పాయింట్

నవంబర్ 20, 2005

కథా నిలయం
Entered



ఇంకానా... సాగనివ్వొద్దు!?

మేలుకో సోదరీ మేలుకో

హ్యాపీ బర్త్‌డే

(*20.11.2005* నుంచి *26.11.2005* వరకు)

బ్రౌన్
10సం॥, 21.11.1995
సునీత-వరప్రసాద్
వర్ని-నిజామాబాద్

లోకేశ్వర్(బన్ని)
నవంబర్-21
కవిత-బాబు
కల్వాపూరు-మెదక్

జె. రాఘవేంద్ర
2సం॥, 22.11.2003
స్వర్ణలత-రమేష్‌కుమార్
ఎల్.బి.నగర్-రంగారెడ్డి

కె. లిఖిత
24.11.2004
వెంకటరమణ-ముక్కంటి
దాచేపల్లి-గుంటూరు

ఎం. అర్జున్ సంతోష్
1సం॥, 24.11.2004
ప్రతిన-సతీష్
హైదర్‌గూడ-హైదరాబాద్

సంజన
1సం॥, 26.11.2004
నాగమణి-ముఖేష్
బాపూజినగర్-కోవూరు

ఎం. సాయి అఖిల
1సం॥, 26.11.2004
సుభాషిణి-కోటేశ్వరరావు
విజయవాడ-కృష్ణా

పవన్‌కుమార్
1సం॥, నవంబర్-2004
అనుషమ్మ-చిన్నా యాదవ్
హిమాయత్‌నగర్-హైదరాబాద్

బిందుప్రియ
1సం॥, నవంబర్-2004
తులసి-మురళి
ఖమ్మం

లక్ష్మీసౌజన్య
రోజమ్మ-ఏసుదాసు
బేతంచెర్ల-కర్నూల్

జి. జయశ్రీ
1సం॥, నవంబర్-2004
మమత-నరేంద్ర
అజిత్‌సింగ్‌నగర్-విజయవాడ

ఎ. చేతన్
3సం॥, నవంబర్-2002
హేమ-శేఖర్
ఎస్‌వి నగర్-తిరుపతి

ఎ. మమత
బాల్‌లక్ష్మి-బాలయ్య
మర్పడగ-మెదక్

ఎ. లోహిత్
1సం॥, 25.11.2004
దుర్గాభవాని-అనిల్‌కుమార్
అజిత్‌సింగ్‌నగర్-విజయవాడ

ఎ. పద్మనాబిరెడ్డి
2సం॥, నవంబర్-2003
శ్రీలత-కృష్ణారెడ్డి
రామకృష్ణాపురం-ప్రకాశం

లోకేశ్వరి
వసంత-వెంకట్‌రెడ్డి
యంజాల్-రంగారెడ్డి

బి. పవన్‌రెడ్డి
1సం॥, నవంబర్-2004
రమణ-సుబ్బారెడ్డి
రాణిగారితోట-విజయవాడ

ఎస్. రాఘవ
శ్రీదేవి-వెంకటరమణమూర్తి
మధవధార-విశాఖపట్నం

ఎం. మాన్విత
5సం॥, నవంబర్-2000
పల్లవి-నరసింహారావు
జగ్గయ్యపేట-కృష్ణా

ఈ వారం అతిథి



మనది సమానావకాశాలు ఇవ్వని సంస్కృతి

మన అతిథి గురించి...

పేరు	: అంగలకుర్తి విద్యాసాగర్
వృత్తి	: రాష్ట్ర గిరిజన సహకార సంస్థ వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్
ఊరు	: అరివేముల, ప్రకాశం జిల్లా
విద్య	: ఎం.ఎ ఎకనామిక్స్, ఐ.ఎ.ఎస్
పుట్టిన తేదీ	: జనవరి 30, 1956
నచ్చిన వ్యక్తి	: చెప్పడం కష్టం
నచ్చని అంశం	: ఏమీ లేదు
అభిరుచి	: జీవితాన్ని ఎలా వస్తే అలా జీవించడం

సమాజంలో తరాలు మారేకొద్దీ సామాజిక విలువలూ మారుతాయి. ఈరోజు మనం బాగుందన్నది మన పిల్లలు బాగులేదంటారు. ఒకప్పుడు కాఫీ, టీ తాగుతున్నారంటే అదో అపరాధంగా భావించేవారు. మరిప్పుడు? ఇంటికి వచ్చినవారికి కాఫీ ఇవ్వడం ఒక మర్యాదగా మారింది. ఒకప్పుడు ఎవరైనా ఇంటికి వస్తే మజ్జిగ ఇచ్చి దాహం తీర్చేవారు. మరిప్పుడు....? తరం మారేకొద్దీ విలువల అర్థం మారుతుంది. ఒకప్పుడు సినిమా చూడటమంటే చెడిపోవడమే. మరిప్పుడో! ఇప్పుడు పొద్దున్న లేచి ఇడ్లీ సాంబారు తినేవాళ్లెందరు? పిజ్జా, బర్గర్లు తినేవాళ్లు పెరిగారు. అందువల్ల సామాజిక విలువలేవీ శాశ్వతంగా ఉండవు. ఏ విలువ మేలు చేస్తుందనేది ఎవరికి వారే ఆలోచించుకోవాలి. మార్పు సహజం. మార్పు లేకుంటే ప్రపంచం మారదు.

సహజంగా మనం ఎవరిని ద్వేషిస్తామో, వారి ఆలోచనా విధానాన్నే అనుకరిస్తాం. మానవ జీవితంలో దౌర్భాగ్యం ఇదే. పాశ్చాత్య సంస్కృతిని అందరూ ద్వేషిస్తారు. కానీ, ద్వేషించేవారిలో ఎక్కువమంది దీనిని అనుకరిస్తారు. కారణం ప్రత్యామ్నాయం తెలీకపోవడమే. పదో శతాబ్దం వరకూ మన దేశంలో కళలు, సంస్కృతి బ్రహ్మాండంగా అభివృద్ధి చెందాయి. అయితే, ఆ అభివృద్ధి ఆధిపత్యవర్గాలకే పరిమితమైపోయింది. ఈ కారణంగా 10-13 శతాబ్దాలమధ్య మన దేశంలో మానసిక స్తబ్దత వచ్చింది. ఆధిపత్యవర్గాలు ఆర్థికంగా, సామాజికంగా, మానసికంగా, రాజకీయంగా అంతరాలు పెంచి మన ప్రజలను మూగవాళ్లుగా ఉంచారు. ఈ పరిస్థితిని బ్రిటిష్‌వాళ్లు ఉపయోగించుకున్నారు. వారి ఆలోచనా విధానాన్ని మనపై రుద్దారు. 'నువ్వు ఒకందుకు పోశావు. నేనొకందుకు తాగాను' అని చెప్పినట్టు బ్రిటిష్‌వాళ్లు వాళ్ల స్వార్థం కోసమే మన దేశానికి వచ్చారన్న విషయం అలా ఉంచితే, పాశ్చాత్య నాగరికతే మనకు చాలావిధాల స్వేచ్ఛనిచ్చింది. మన దేశంలో మనిషిని మనిషిగా గుర్తించలేని తత్వం ఉండేది. ప్రతి మనిషినీ కులం, మతం, ధనం, ప్రాంతం ప్రాతిపదికనే గుర్తించేవారు. ఇప్పటికీ అదే కొనసాగుతోంది. ఇది పోవాలి. ఈ సంస్కృతి అందరికీ సమానావకాశాలు ఇవ్వలేదు. కనీసావసరాలు తీర్చలేదు. ఈ దేశంలో వనరులున్నాయి. వీటిని అందరూ అనుభవించే అవకాశం కల్పిస్తే అప్పుడు మన ప్రజలు ఈ సంస్కృతిని అభిమానిస్తారు. దోపిడీకి గురవుతున్నవారికి సమానావకాశాలు రాకపోతే వారు ఈ దేశాన్ని, ఈ సంస్కృతిని వారు 'తమది' అనుకోలేరు. పొద్దున్న లేచి పేవ్‌మెంట్‌మీద బతికేవాడు దేశం, సంస్కృతి గురించి ఏమని ఆలోచిస్తాడు? అన్నీ అమరినవాడే దేశభక్తి, సంస్కృతి అని చెప్తూంటాడు. డబ్బున్నవాడే ప్రజల ఆలోచనలు వేరేవైపు మళ్లించడానికి సంస్కృతి అంటూ కబుర్లు చెప్తాడు. వాడికి నీతి ఉండదు. మధ్యలో ఉన్నవాడు పొద్దుపోక సంస్కృతి చెడిపోతోందంటూ మాట్లాడతాడు. కిందనున్న కష్టజీవికి సంస్కృతి, నీతి గురించి ఆలోచించే తీరిక ఉండదు. మన దేశంలో అన్నిరంగాల్లోనూ నాయకులుగా తయారవడానికి చాలా సులువైన మార్గాలున్నాయి. సమస్యల గురించి ఏమాత్రం అవగాహన లేనివారే ఎక్కువ శాతం నాయకులుగా తయారైపోతున్నారు. ఇది మన దౌర్భాగ్యం. అందరికీ సమానావకాశాలు కల్పించే దిశగా మన నాయకత్వం ఆలోచించాలి. అప్పుడే ఈ సంస్కృతిని మన ప్రజలు అభిమానించగలుగుతారు.

ఈ సంచికలో...

టపా ... 2
టర్నింగ్‌పాయింట్ 4
సలహాలు ... 5
ఇంటి సంగతులు 6
మనసా తెలుసా 7
క్యాంపస్ ఛాట్ ... 10
సినిమా కబుర్లు 11
బాలనేస్తాలు 12
అట్టమీది కథ ... 14
మనమూ మన నమ్మకాలు 20
ఓ ఊరి కథ ... 21

సీరియల్ 20
మాధవి

ఇంకా...

నేర్చుకుందాం రా 3
కలర్స్ ఎన్నుకోవటం ఎలా ?

కథ 18
ఎండమావి

ఆరోగ్యం ... 17
పప్పెట్ ఇంటర్వ్యూ ... 19
అవీ... ఇవీ ... 22
విజ్ఞానవీచిక ... 23
కొత్త పుస్తకాలు ... 24

విలువైన సమాచారం

'స్నేహ' అనుబంధంలోని ముఖచిత్ర కథ 'సృష్టికి ప్రతి సృష్టి...' చాలా విలువైన సమాచారమందించింది. ఫైల్ చేసుకునే విధంగా ఉంది. జీవికి జెరాక్స్ కాపీలన్న వైనాన్ని గుర్తుతెస్తున్న క్లోనింగ్ మానవ మేధస్సుకు, అభివృద్ధి చెందుతున్న విజ్ఞాన శాస్త్రానికి పరాకాష్ట. 'ఓ ఊరి కథ' శీర్షిక ద్వారా ఎన్నెన్నో ఊర్ల కథా కమామిషు తెలుసుకుంటున్నాం. కార్టూన్లు నవ్వుల పువ్వులను రువ్వుతున్నాయి. అన్నీ శీర్షికలు, రచనలు ఆకట్టుకుంటున్నాయి. ఇలాగే స్నేహ ప్రతి ఆదివారం దిగ్విజయంగా కొనసాగాలని... అందర్నీ అలరింపజేయాలని అభిలషిస్తూ...

నేమాన సుభాష్ చంద్రబోస్, శ్రీకాకుళం.



సృష్టికి ప్రతిసృష్టి

'సృష్టికి ప్రతిసృష్టి' చదివిన తర్వాత క్లోనింగ్ గూర్చి శాస్త్రరంగంలో అద్భుత సృష్టి గూర్చి తెలుసుకోగలిగాం. అదే విధంగా జీవికి జెరాక్స్‌కాపీలు, స్టెమ్ సెల్ థెరపీతో వైద్యం లాంటి అనేక విషయాలు తెలుసుకోగలిగాం. 'ఆరోగ్యం' పేజీలో రైబో ఫ్లావిన్ విటమిన్ గూర్చి తెలుసుకున్నాం. విజ్ఞాన వీచికలో 'ఆ వాసన వచ్చిందంటే పరాన్నజీవి పని ఫట్' చదివి కొంత సమాచారం తెలుసుకున్నాం. ప్రతివారమూ ఒక్కో అతిథి గురించి అందిస్తున్న వివరాలు బాగున్నాయి. మొత్తానికి అన్ని శీర్షికలూ హైలెట్‌గా ఉన్నాయి.

కె. సతీష్ రెడ్డి, జడలపేట, వరంగల్

అపారం

నల్లజాతి కలువ, రోసా పార్కు తన జాతివారికి చేసిన సేవ అపారం. ఇడియట్ కార్టూను బాగుంది. శ్రీ రాముడిని, గాంధీజీని ఆదర్శంగా తీసుకున్న మల్లెల రెడ్డితో కబుర్లు బాగున్నాయి. డేరా అట్టమీద కథ బాగుంది. విజ్ఞాన వీచిక అంశాలు బాగుంటున్నాయి. అవీ ఇవీ లోని 'కలువ చేతులు' బాగున్నాయి. బాలలకథ బాగుంది. పుస్తక పరిచయంలో చిరునామా సరిగా రాయగలరు.

వాస్తు రామచంద్ర, రాంజీనగర్, నెల్లూరు-2

ఆలోచనాత్మకం

ప్రతి ఆదివారమూ స్నేహను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నందుకు అభినందనలు తెలియజేస్తున్నాను. హ్యాపీ బర్త్‌డే శీర్షికలో ప్రచురిస్తున్న బాలల జన్మదినోత్సవ ఫోటోలు స్నేహకు మరింతగా వన్నెతెస్తున్నాయి. మమ్మల్ని పరవశింపజేస్తున్నాయి. అదేవిధంగా టర్నింగ్‌పాయింట్‌లో 'మొఘల్ సామ్రాజ్యాన్ని కాపాడిన శరాఘాతం' అనే వ్యాసం ఆలోచనాత్మకంగా ఉంది.

జెజెసిపి బాబూరావు, పెద్దకొత్తపల్లి, మహబూబ్‌నగర్.

ఇంటి సంగతులు

రోజులు గడుస్తున్నా...సమాజం దినాదినాభివృద్ధి చెందుతున్నా మూఢనమ్మకాల మత్తులో పడి మునుగుతున్న వారు కొందరు ఈనాటికీ మన సమాజంలో ఉన్నారు. 'అప్పుడే అమ్మాయికి పెళ్లా...?' అంటూ ఇంటికి, ఇల్లాలికి సంబంధించిన విషయాలను 'ఇంటి సంగతులు'లో వివరిస్తున్న తీరు అద్భుతం. రమణి, జానకిలు చేతులు కలిపి మంచి ఆలోచనతో ముందుకు సాగడం మమ్మల్ని మైమరిపించింది.

కర్రా వరప్రసాద్, యలమర్రు కండ్రిక, కృష్ణా

తెలుసుకోవలసినవి

నేను స్నేహలోని అన్ని అంశాలూ చదివాను. ఈ వారం అతిథిగా వచ్చిన మద్ది గోపాలకృష్ణా రెడ్డి చెప్పిన విషయాలు అందరినీ ఆలోచింపజేసేవిగానూ, తెలుసుకోవలసినవిగానూ ఉన్నాయి. అందరూ ఒక పరిధిలో కొద్దోగొప్పో నేర్పే వాళ్లే అంటే గురువులేననీ, ఇంకో పరిధిలో నేర్చుకునే వాళ్లే అంటే శిష్యులేననీ వివరించడం బాగుంది.

దివ్య, ఖమ్మం.

అంతకంటే గొప్ప!

సృష్టి అసలు సృష్టి అంటే ఏమిటి? ఓ పట్టాన అర్థం కాదు. సృష్టికి ప్రతి సృష్టి చేసిన విశ్వామిత్రుడెంతటి గొప్పవాడో తెలిసిందే... నేడు సృష్టికి ప్రతిసృష్టి చేస్తున్న మానవుడు అంతకంటే గొప్పవాడేమోననిపిస్తుంది. అచ్చు జిరాక్స్ కాపీల్లా మనుషులను సృష్టిస్తున్న ఈ క్లోనింగ్... చాలా అద్భుతమైంది. ఇంతటి సాంకేతిక పరిజ్ఞానాన్ని కనుగొన్న మానవ మేధస్సు అద్భుతం. కవర్ స్టోరి బాగుంది.

బి. రాజేశ్వర్, పొన్కల్

కలర్స్ ఎన్నుకోవటం ఎలా ?

సండే డెస్క్

ఫ్యా(బ్రిక్ డిజైనింగుకు కలర్ బ్యాలన్స్ అనేది అత్యంత అవసరం. ఈ బ్యాలన్స్ చేసుకునేప్పుడు మనం ఎన్నోరకాల స్కీమ్స్‌ని అనుసరించవచ్చు. వీటిలో కాంప్లిమెంటరీ కలర్స్ స్కీమ్ ఒకటి.

పరస్పరం కలిసిపోయే గుణం కలిగిన రంగుల మధ్య బ్యాలన్స్ తీసుకురావడమే 'కాంప్లిమెంటరీ కలర్స్ స్కీమ్' పసుపు, నారింజ రంగులను పక్కపక్కనే ఉంచి చూడండి. "రెండూ ఒకేలా కనిపిస్తున్నాయ్. ఇదేం కాంబినేషన్‌రా బాబూ" అనుకుంటున్నారా. దీన్నే ఫ్యా(బ్రిక్ డిజైనింగ్‌లో కాంప్లిమెంటరీ కలర్‌స్కీమ్, కలర్ కాంబినేషన్ అంటారు. ఈ తరహా కలర్ బ్యాలెన్స్‌లో ఒకవైపు పసుపు, మరో వైపు నారింజ రంగును ఉపయోగిస్తారు.

(బ్రైట్ ఫినిషింగ్ కోసం

మీరేదైనా ఒక డిజైనుకు (బ్రైట్ ఫినిషింగ్ ఇవ్వాలనుకుంటున్నారా? అయితే ఎరుపు, పసుపు, నీలిరంగులను దీనికి ఉపయోగించండి. భిన్నత్వం కలిగిన ఈ రంగులను ఒకే డిజైనింగ్‌లో వాడడాన్ని 'కాంట్రాస్ట్ కలర్ స్కీమ్' అంటారు. ఇవి చూపరులను ఇట్టే ఆకర్షిస్తాయి.

మెనో(క్రోమ్ కలర్ స్కీమ్

ఏదైనా ఒక రంగును తీసుకోండి. తెలుపు లేదా నలుపు రంగులను దానికి కలపండి. ఈ రంగులను కొద్ది శాతం కలిపితే ఒక రంగు, ఎక్కువ శాతం కలిపితే మరో రంగు రావడం మీరు గమనించే ఉంటారు. ఇలా ఒకేరంగును రకరకాల షేడ్స్‌లో ఉపయోగించుకోవచ్చు. దీన్నే 'మెనో(క్రోమ్ కలర్ స్కీమ్' అంటారు.

అందమైన రంగులతో, ఆకర్షణీయమైన డిజైన్లతో బట్టలను మరింత ఆకర్శణీయంగా తయారుచేయొచ్చు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుంటే మీరు చూపరులను ఇట్లే ఆకర్షించేలా మీ బట్టలకు ఎం(బ్రాయిడరీ వేసుకోవచ్చు.ే ఈ వస్తువులు మీ దగ్గరున్నాయో... లేదో చూసుకోండి మరి.

బట్టలు, (డ్రస్ మేకర్ కత్తెర, స్మాల్ పాయింట్ కత్తెర, పాయింట్ కత్తెర, జిగ్ జాగ్ కత్తెర, పెద్ద కన్ను సూది, గుం(డటి కన్ను సూది, వెడల్పు కన్ను సూది, ఫోకర్, ఉడెన్ (ఫేమ్, పెన్సిల్, స్కేల్, ఎం(బ్రాయిడరీ రింగు, వేలి రింగు, బోర్డ్ కిన్, ఎం(బ్రాయిడరీ దారం, మెషినరీ ఎం(బ్రాయిడరీ రీల్, ఎం(బ్రాయిడరీ నూలు.

ఈ వస్తువులన్నీ కేవలం ఎ(బ్రాయిడరీకి మా(త్రమే పనికొస్తాయనుకుంటున్నారా? వీటిలో కొన్ని (ఫా(బ్రిక్ పేయింటింగుకు ఉపయోగించుకోవచ్చు. అయితే ఈ వస్తువులతో పాటు, కావలసిన రంగులనూ అందు బాటులో ఉంచుకోవాలి. వచ్చేవారం మరి (ఫా(బ్రిక్ పేయింటింగ్ గురించి తెలుసుకుందామా....

SISI
GOVT. OF INDIA
(MINISTRY OF SSI)
GUINDY, CHENNAI-32.

అడ్మిషన్ 2005-2006

కేటరింగ్ టెక్నాలజీ డిప్లొమా - 6నెలలు
కేటరింగ్ టెక్నాటజీలో అడ్వాన్స్‌డ్ డిప్లొమా - 1 సంవత్సరం
కేటరింగ్ టెక్నాలజీ అడ్వాన్స్‌డ డిప్లొమా
& హోటల్ మేనేజ్‌మెంట్ -2 సంవత్సరాలు

అర్హత : పదవ తరగతి ఉత్తీర్ణత ఆ పైన

ప్రభుత్వ సర్టిఫికెట్లు ఇవ్వబడును

- సులభమైన వాయిదా పద్ధతులు
- స్టార్ హోటల్స్‌లో శిక్షణ - పార్ట్ టైం ఉద్యోగాలు - ఉద్యోగం చూపించుటలో సహకారం - కంప్యూటర్ శిక్షణ
- స్పోకెన్ ఇంగ్లీష్ - ఉద్యోగ అవకాశాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమం - హాస్టల్ సౌకర్యం.

సంప్రదించండి:
నెం. 294, ఎం.టి.హెచ్.రోడ్, ఆవడి, చెన్నై - 600 054
ఫోన్: 044-55396828/044-26373218, సెల్: 9884414844

క్యాటరింగ్ కోర్సు విజయవంతంగా పూర్తి చేసిన వారి మాటల్లో...

నాపేరు ఎస్. సైమన్‌రాజ్, నేను **S.I.S.I., Avadi** నందు ఒక సంవత్సర అడ్వాన్స్‌డ్ డిప్లొమా క్యాటరింగ్ కోర్సు (2004 సంవత్సరం) చేశాను. ఉన్న క్యాటరింగ్ కాలేజీలలోకల్లా ఈ కాలేజీలో ఉత్తమమైన భోదన కల్పించబడింది. (ప్రస్తుతం, చెన్నైలోని **"హోటల్ సరోవరం"** లో రూ.5000 నెలసరి జీతానికి ఉద్యోగం చేస్తున్నాను. ఎస్.ఐ.ఎస్.ఐ. ఆవడికి కృతజ్ఞతలు (ఎస్. సైమన్‌రాజ్, 13/506,శక్తి నగర్,మేళంగాడు, మత్తుకరై, కోయంబత్తూరు - 641 105)

నా పేరు సునీత. నేను చదువుతున్న బి.కాం కోర్సును మధ్యలోనే వదిలి **S.I.S.I., Avadi** లో ఒక సంవత్సర క్యాటరింగ్ కోర్సులో చేరాను. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే ఉత్తమమైన విద్యను భోదించారు. ఒక సంవత్సరం ఆంగ్లంలో రాయడం, చదవడం నేర్చుకున్నాను. చెన్నైలోని హోటల్ సరోవర్‌లో (ట్రైనింగ్ పూర్తి చేశాను. (ప్రస్తుతం అదే హోటల్‌లో రూ.5000/-లు జీతంతో ఉద్యోగం దొరకడం ఆనందదాయకం.
(సునీత, డి.సి./2, ఎస్.ఎం.క్యూ. 64, ఎయిర్‌ఫోర్సు స్టేషన్, ఆవడి చెన్నై)

నాపేరు దినేష్, నేను పదవ తరగతి వరకు చదివి ఏమి చేయాలో తెలియని స్థితిలో ఉన్నప్పుడు మా స్నేహితుల ఆలోచన మేరకు **S.I.S.I., Avadi** లో ఒక సంవత్సర క్యాటరింగ్ కోర్సులో చేరాను. కోర్సు కాలంలోనే అవుట్‌డోర్ క్యాటరింగ్‌లో స్టార్ హోటల్‌లో పార్ట్‌టైం ఉద్యోగిగా పనిచేసే అవకాశం వచ్చింది. దీని ద్వారా వచ్చిన జీతంతో కోర్సు ఫీజులు కట్టి విజయవంతంగా కోర్సు పూర్తి చేసి ఎయిర్ ఫోర్స్ క్యాటరింగ్‌లో రూ.6500/-లకు ఉద్యోగం లభించింది.
(దినేష్, నెం.సి76, ఎం.పి.టి. క్వార్టర్స్, తొండియార్‌పేట్టై, చెన్నై - 81)

మంచి కోర్సు, ఉద్యోగాలు ఎక్కువగా వచ్చే అవకాశమున్న క్యాటరింగ్ కోర్సు చేసిన వెంటనే ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. "(ప్రస్తుతం చెన్నైలోని హోటల్ పార్క్ నందు హౌస్ కీపింగ్ డిపార్ట్‌మెంట్‌లో రూ.6000/- జీతంతో పనిచేస్తున్నాను" అని కవిత సంతోషం వ్యక్తం చేసింది.
(కవిత, నెం.36, 5వ (క్రాస్ రోడ్డు, (ప్రకాష్ నగర్, తిరునిం(డవూర్, చెన్నై)

ర్నింగ్ పాయింట్

ఆవిరిశక్తి... మహత్తర పారిశ్రామిక విప్లవానికి నాంది

వకుళాభరణం రామకృష్ణ

ఒక రోజు జేమ్స్‌వాట్, కాఫీ తయారు చేయడాన్కి నీళ్ళు కాచుకొంటూవుంటే, గిన్నెపై పెట్టిన మూత ఆవిరి ఒత్తిడికి పైకి, కిందికి లేస్తూ, కదుల్తూండటం గమనించాడు. దాంతో ఆవిరిశక్తిని గూర్చిన ఆలోచన మొదటిసారి ఆయన మదిలో తొలిచింది.

నేటిమానవులు, భౌతికంగా ఎన్నో సౌకర్యాలను అనుభవిస్తూ, 'సుఖవంతమైన' జీవనాన్ని కొనసాగిస్తున్నారు. రవాణా, సమాచార, శాస్త్ర, వైజ్ఞానిక, వైద్య, విద్యా రంగాల్లో అసమాన ప్రతిభను చూపుతున్నారు. అంతరిక్ష, గ్రహాంతరయానాలు చేస్తున్నారు. చంద్ర మండలానికి 'హనీమూన్'కు ఏర్పాటు చేసుకుంటున్నారు. విస్తారంగా పెరిగిన కంప్యూటర్ సమాచార వసతుల వల్ల, ఇవ్వాళ ప్రపంచం ఒక చిన్న కుగ్రామంగా తయారైంది. ఇవన్నీ నమ్మలేని నిజాలుగా మనముందు నిలిచాయి. గతంలో జీవించినవారు ఎవరైనా, సోక్రటీస్ లేదా అశోకుడు, తిరిగి బతికొచ్చి, ఇదంతా చూస్తే, తీవ్ర సంభ్రమాశ్చర్యాలకు గురయ్యే పరిస్థితి.

అయితే... ఇదంతా ఎలా జరిగింది? దీనికంతటికీ దోహదం చేసిన ఘటన ఏమిటి? ఒక్కమాటలో చెప్పాలంటే పారిశ్రామిక విప్లవం అనాలి. 18వ శతాబ్దం విప్లవాలయుగం. ఆర్థిక రంగంలో పెను మార్పులకు పారిశ్రామిక విప్లవం దోహదం చేయగా, రాజకీయంగా అమెరికన్ విప్లవం, రాజకీయ-సామాజిక ప్రాధాన్యతలను సంతరించుకొని ఫ్రెంచి విప్లవం వచ్చింది. పారిశ్రామిక విప్లవం భారీ యంత్రాలను మానవాళి ముందుకు తెచ్చింది. యంత్రయుగానికి నాంది పలికింది. యంత్రం అంటే ఏమిటి ? మనిషికి తన పనిలో సాయపడే భారీ పనిముట్టు. మనిషిని పనిముట్లు తయారుచేసే జంతువుగా పేర్కొన్నారు. మానవాళి ఆవిర్భావం నుండి మనకు కావాల్సిన జీవిత నాణ్యతను మెరుగుపర్చుకొని అవసరమైన పనిముట్లను తయారు చేసుకొంటూ వచ్చారు మానవులు. అవధిలేని ఈ అన్వేషణ, మానవ సమాజాన్ని ఒక్కో మెట్టు పైకి తీసుకెళ్ళి, ఇవ్వాల్టి స్థాయికి తీసుకొచ్చింది. ఈ సాయం వల్లే, తనకంటే ఎన్నో రెట్లు బలమైన, క్రూర జంతువులను కూడా లోబరు చుకొంటూ, ప్రకృతిని జయిస్తూ, ముందుకెడుతున్నారు మానవులు.

పనిముట్టు వాస్తవానికి మానవులకు మూడోచెయ్యి లాంటిది. సహజంగా, పుట్టుకతో వచ్చిన రెండు చేతులే మనిషికి మొదటి పనిముట్టు. వీటి ద్వారా ఉత్పత్తి పెరిగి, చాలినంత తీరిక లభించి, కళలు సారస్వతం, సమస్త సంస్కృతీ పెంపుదలకు దోహదం చేసింది. పారిశ్రామిక విప్లవానికి అంకురార్పణ చేసి, చరిత్రనే పెను మలుపు తిప్పిన మొదటి ఆవిష్కరణ, 1738లోనే కే (Kay) కనుగొన్న మరమగ్గం. బట్టల నేతలో ఇది చేమగ్గానికి ప్రత్యామ్నాయంగా రూపొంది, వస్త్రోత్పత్తిని అధికం చేసింది. ఆ తర్వాత, 1764లో హార్‌గ్రీవ్స్, స్పిన్నింగ్ జెన్నీని, నూలు వేగవంతంగా వడికే యంత్రాన్ని కనుగొని



జేమ్స్‌వాట్



బట్టల ఉత్పత్తిని మరింత అధికం చేశారు.కానీ పారిశ్రామిక విప్లవానికి ఆయువుపట్టు లాంటి పరిశోధన, 1765లో జేమ్స్ వాట్ కనుగొన్నారు. దాని పేరే అవిరిశ్రమతో నడిచే యంత్రం. మనకు చిన్నప్పుడు చెప్పిన కథలో, ఒక రోజు జేమ్స్‌వాట్, కాఫీ తయారు చేయడాన్కి నీళ్ళు కాచుకొంటూవుంటే, గిన్నెపై పెట్టిన మూత ఆవిరి ఒత్తిడికి పైకి, కిందికి లేస్తూ, కదుల్తూడటం గమనిం చాడు. దాంతో ఆవిరిశక్తిని గూర్చిన ఆలోచన మొదటిసారి, ఆయన మదిలో తొలిచింది. అంతే... ఇక వెనుదిరిగి చూడలేదు. ఆవిరి యంత్రాన్ని కనుగొన్నాడు. ఆ. ఆవిరి శక్తిని యంత్రాలకు జోడించి, ముందుగా జౌళీ పరిశ్రమను భారీగా అభివృద్ధి చేశారు.

యంత్రాల పెంపుదలతో మానవజీవితం గొప్ప మార్పుకు లోనయింది. ఆవిరి యంత్రాలకు బొగ్గు అవసరమైంది. దాంతో బొగ్గు గనులు కనుగొన్నారు. బొగ్గు పరిశ్రమ పెరగడంతో, ఇనుము, ఉక్కు పరిశ్రమలు పెంపొందాయి. ఆ తర్వాత స్టీఫెన్‌సన్ ఆవిరితో నడిచే రైలింజను కనుగొనడంతో, రవాణా రంగంలో వేగవంతమైన మార్పులొచ్చాయి. బొగ్గు గనులు, ఆవిరియంత్రం, జవుళి పరిశ్రమను, ఇనుము, ఉక్కు పరిశ్రమలు ఒకదానితో మరొకటి పరస్పరం పోషించుకొంటూ, ఇంగ్లండ్‌లో ఆరంభమైన పారిశ్రామిక విప్లవం, ప్రపంచ ముఖచిత్రాన్నే సమూలంగా మార్చివేసింది.

ఆఖర్లో ఒక మాట. ఈ పారిశ్రామిక విప్లవంలో కేవలం అనుకూలాంశాలేకాదు. వ్యతిరేకాంశాలు కూడా వున్నాయి. వస్తూత్పత్తి అధికమై, సంపద పెరిగిన మాట నిజమే! కానీ ఇది సమాజంలో ధనికవర్గాన్ని పెట్టుబడిదారీ వర్గాన్ని, ఫ్యాక్టరీలలో పనిచేసే, యంత్రభూతముల కోరలు తోమే కార్మిక వర్గాన్ని సృష్టించింది. దారిద్ర్యం, మురికి, అవిద్య, కర్మాగారాల్లో నెలకొన్న అత్యంత దయనీయ శ్రామికుల స్థితిగతులు నెలకొన్నాయి. అధికోత్పత్తిని విదేశాలకు ఎగుమతి చేసి, అక్కడ మార్కెట్లను ఆక్రమించింది. అక్కడున్న స్వదేశీ పరిశ్రమలను ధ్వంసం చేసి, వలసవాదానికి, సామ్రాజ్యవాదానికి దారితీసింది. అందుకే పారిశ్రామిక విప్లవం తర్వాత నెలకొన్న పరిస్థితులను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, కారల్‌మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్ తమ 'కమ్యూనిస్టు మానిఫెస్టో', కాపిటల్ గ్రంథాల్లో విశ్లేషణాత్మకంగా వీటి ఫలితాలను వివరించారు. మార్క్సిస్టు సిద్ధాంత ప్రభావంతో, ప్రపంచ కార్మికులు సంఘటితమై ఏకమై, తమకున్న సంకెళ్ళను బద్దలుకొట్టి, అనేక దేశాల్లో విప్లవాలు నిర్వహించి, సామ్యవాద ప్రభుత్వాలనేర్పర్చుకోవడం జరిగింది. ఈ పరిణామాలన్నీ, పారిశ్రామిక విప్లవ ఫలితాలే! ఆవిరియంత్రం కనుగొన్న అద్భుతఫలితం ఇంతదాకా వచ్చిందన్నమాట!

ఇంజెక్షన్ సూట్ ఎలా తీసుకోవాలి ?

మేం చాలా పేద వాళ్లం. అందులో 90 ఏళ్ల నుండి హైదరాబాద్‌లోని ఇనాం భూమిలో గుడిసెలు వేసుకొని నివసిస్తున్నాం. మమ్మల్నెవరన్నా లేపేస్తారేమోనని భయంగా ఉంది. అలా వీలుకాకుండా, మేం అందులో ఉన్నట్లుగా మేం కోర్టు ద్వారా ఇంజంక్షన్ సూట్ తీసుకోవాలనుకుంటున్నాం. ఇదెలా ఉపయోగపడుతుంది. మాకు సలహా ఇవ్వగలరు.

బి. వేణు.మలక్‌పేట

జి.ఎల్.నరసింహారావు,
హైకోర్టు న్యాయవాది

కాంట్రాక్టు దక్కాలంటే

నేను భద్రాచలం గ్రామ పంచాయతీలో కాంట్రాక్టు వర్కరుగా 15 సంవత్సరాల నుండి పని చేస్తున్నాను. మా గ్రామ పంచాయతీ కార్యాలయంలో కాంట్రాక్ట్ టెండరును బయటి వ్యక్తులకివ్వట్లేదు. మా వర్కర్స్‌లోనే ఒకరి పేరు మీద టెండరు తీసుకుని ఇప్పటి వరకు పనిచేశాం. కాని ఇప్పుడు ప్రభుత్వం భద్రాచలం గ్రామ పంచాయితీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసింది. మున్సిపాలిటీ నిబంధనల ప్రకారం కాంట్రాక్ట్ వర్కర్ను విధానాన్ని బహిరంగ టెండరు ద్వారా తీసుకుంటారని తెలిసింది. మున్సిపాలిటీలోనూ మాకే కాంట్రాక్టు దక్కాలంటే ఏం చేయాలి. మమ్మల్ని పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని ఎలా డిమాండ్ చేయాలి? ఇన్ని సంవత్సరాలు పని చేసినట్లు, రెవెన్యూ స్టాంప్‌పై మా సంతకాలు గల ఓచర్స్ తప్ప మా దగ్గర ఎటువంటి ఆధారాలూ లేవు. పూర్తి వివరాలు తెలియచేయవలసిందిగా కోరుతున్నాము.

ఎం. రాజారామ్
భద్రాచలం, ఖమ్మం జిల్లా

మీరు ఆ ఈనాం భూముల్లో గుడిసె మాత్రమే వేసుకున్నారు. దానికి కరెంటు, నల్లా లాంటివేమన్నా వేయించారా ? వేయించుకునుంటే వాటి బిల్లులు వగైరా ఏమైనా ఆధారాలు న్నాయా? అవి ఉంటే ఇంజక్షన్ తీసుకోవడానికి మీకు ఉపకరిస్తాయి.

మీరిప్పటి వరకూ కాంట్రాక్ట్ వర్కర్స్‌గానే పని చేశారు. కాంట్రాక్ట్ వర్కర్‌గా మీకు ఆ చట్ట ప్రకారమే హక్కులుంటాయి. పర్మినెంటు చేయమనే హక్కుండదు. దానిపై ప్రభుత్వం వారే నిర్ణయం తీసుకోవాల్సుంటుంది. కాంట్రాక్టు పనికి బహిరంగంగానే టెండర్లు పిలవాల్సి ఉంటుంది. న్యాయపరంగా మీరు పర్మినెంట్ కోరలేరు. ప్రభుత్వాన్నే కోరి ఒత్తిడితోనైనా ఒప్పించగలిగితే, న్యాయం పొందొచ్చు.

తీసివేస్తే...

ఒకటో క్లాసులో గణితం చెబుతున్నాడు. టీచర్. తన రెండు చేతులు చూపించి "ఇవి మొత్తం పది వేళ్లు. వీటిలో ఐదు తీసివేస్తే ఇంకెన్ని ఉంటాయి" అనడిగాడు.

అప్పుడో విద్యార్థి లేచి " ఒక మొండి చేయి, ఒక వేళ్లున్న చేయి" అన్నాడు.

- పెండెం జగదీశ్వర్



ఈ రోజుల్లో బాత్‌రూం ఇంటిగదుల్లో ఓ భాగమైపోయింది. బెడ్‌రూముకు, హాలుకు అటాచ్డ్‌గా బాత్‌రూములను నిర్మిస్తున్నారు. ఇంటి శుభ్రత విషయంలో ఏ విధమైన శ్రద్ధ తీసుకుంటామో, బాత్‌రూంను శుభ్రంగా ఉంచడంలోనూ అంతే శ్రద్ధ వహించాలి.

కె నిర్మల

బాత్రూమ్... ఇంట్లో భాగమే



బాత్‌రూము శుభ్రతను అశ్రద్ధ చేస్తే అనారోగ్యాలొస్తాయి. అందుకే బాత్‌రూం పరిశుభ్రతపట్ల ఏవిధమైన జాగ్రత్తలు తీసుకోవాలో అందరూ తెలుసుకోవాలి. వాటిని పాటించాలి.

బాత్‌రూముకు తప్పనిసరిగా వెంటిలేటరుండాలి. ఎగ్జాస్ట్ ఫ్యాను అమర్చాలి. సూర్యకిరణాలు లోపలికి ప్రవేశించేలా ఉంటే మంచిది. గోడకు షెల్ఫ్ తప్పని సరి. అందులో సబ్బు, వాషింగ్ పౌడరు, షాంపూ, టూత్‌పేస్టు, బ్రష్షులు, టంగ్ క్లీనర్‌లు, ఫినాయిల్, డెట్టాల్, బట్టలుతికే బ్రష్, తెల్లబట్టలకుపయోగించే బ్లూ మొదలైనవెన్నో సర్దుకోవచ్చు. వీటిలో పనికిరాని టూత్‌బ్రష్‌లు, ఖాళీ సీసాలు ఉంచుకోకూడదు. విడిచిన బట్టలన్నీ బాత్‌రూములో ఓ మూల కుప్పగా పడేయకూడదు. వాటినుంచడానికి ఓ ప్లాస్టిక్ బక్కెట్టును గానీ ఓ పెద్ద టబ్బును గానీ ఉంచాలి. వాడేసిన ష్యాంపూ ప్యాకెట్లు, అరిగిపోయిన సబ్బు ముక్కలు బాత్‌రూములో ఉంచకూడదు.



పొరబాటున వాటిమీద కాలేశారనుకోండి... జారిపడే ప్రమాదముంది. బాత్‌రూములో గడియలు చిన్నపిల్లలకందనంత ఎత్తులో అమర్చాలి. ఎందుకంటే పిల్లలకందేంత ఎత్తులో గడియ ఉందనుకోండి... బాత్‌రూములోకెళ్లిన తర్వాత గడియపెట్టేసుకుంటారు. స్నానం ముగించి బయటికొద్దామని గడియతీయబోతే... అది మొరాయించిదనుకోండి ఇక వారు పడే భయాందోళనలకు హద్దుండదు. వాష్‌బేసిన్ పక్కన నాప్‌కిన్ ఉంచడానికి వీలుగా స్టాండునమర్చుకోవాలి. వాష్ బేసిన్ మీద అద్దాన్నమర్చాలి. బట్టలు పెట్టుకోవడానికి గోడకు తప్పనిసరిగా స్టాండునమర్చాలి. బాత్‌రూములో డ్రయినేజీకి అమర్చిన మూతమీద కలరా ఉండలను వేయాలి. అందరి స్నానాలూ అయిపోగానే బాత్‌రూంను శుభ్రంగా ఫినాయిల్‌తో కడగాలి. బాత్‌రూం దుర్వాసన రాకుండా ఓజోనిక్‌లాంటివి ఉంచాలి. తలుపులను కొంత సమయం తెరచి ఉంచాలి. పాదాలను తుడుచుకోవడానికి తప్పని సరిగా డోర్‌మాట్‌నుంచాలి. అది పరిశుభ్రంగా ఉండేట్లు చూసుకోవాలి. బాత్‌రూం గోడకున్న టైల్స్‌ను, ఫ్లోరింగును వారానికొకసారి బ్రష్‌తో రుద్దికడగాలి. నీటి తొట్టెల మీద మూతలనుంచాలి.

మనసా... తెలుసా?

"మా పిల్లల్ని కొట్టే అధికారం మాకు లేదా? ఇదెక్కడి చోద్యం. బాగానే ఉంది వరుస" అంటూ పెద్దవాళ్లు యాగీ చేస్తారు. "వాళ్ళంటే మాకేమైనా పగా చెప్పండి? వాళ్లనో దారిలో పెడదామనేగా మా ప్రయత్నం" అంటూ టీచర్లు నొచ్చుకుంటారు. టీనేజీ పిల్లలను తిడితే... వారి మనసు చివుక్కుమంటుంది.

రూల్స్ ఇలా ఉండాలి

హిప్నో కమలాకర్
కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్,
ఫోన్ : 9849130141



'మీ టీనేజీ పిల్లలను అర్థంచేసుకోండి' అనే మకుటంతో పుస్తకం వాసిన వైన్‌రైస్, డేవిడ్ వీర్‌మాన్‌లు రెండురకాల స్వభావాలు గల ఆంక్షలను ఇంట్లో ప్రవేశపెట్టాలని స్పష్టంచేస్తున్నారు.

1. కుటుంబ సభ్యులంతా పరస్పర గౌరవంతో మెలగాలి.

2. తమ చర్యలకు పూర్తిబాధ్యత వహించాల్సింది కుటుంబసభ్యులు మాత్రమే.

ఈ రెండు నిబంధనలను మరి కాస్త వివరంగా తెలుసుకుందాం.

కుటుంబసభ్యులు ఇంట్లో శారీరక హింసకు పాల్పడరాదు. అంటే పిల్లల్ని కొట్టకూడదు.

"మా పిల్లల్ని కొట్టే అధికారం మాకు లేదా? ఇదెక్కడి చోద్యం. బాగానే ఉంది వరుస" అంటూ పెద్దవాళ్లు యాగీ చేస్తారు. "వాళ్ళంటే మాకేమైనా పగా చెప్పండి? వాళ్లనో దారిలో పెడదామనేగా మా ప్రయత్నం" అంటూ టీచర్లు నొచ్చుకుంటారు. టీనేజీ పిల్లలను తిడితే... వారి మనసు చివుక్కుమంటుంది. తమ స్వాభిమానం పూర్తిగా పోయినట్టు ఫీలౌతారు. తిట్లను తట్టుకోవడం వారికి సాధ్యంకాదు. దీనికి తోడు దెబ్బలూ తినడమంటే వారికి మరింత కంటకంగా ఉంటుంది. తమ స్వాభిమానానికి గట్టి దెబ్బే తగిలినట్టుగా వారు బాధపడతారు. తల్లిదండ్రులు తమను శారీరకంగా బాధిస్తున్నారనీ, వారు తమ నైతిక బాధ్యతలను విస్మరించారనీ పిల్లలు అనుకుంటారు. అలా నైతిక బాధ్యతలను విస్మరించే వారినెవరైనా దండించాలనే వారు ఆలోచిస్తారు. ఈ ఆలోచనే వారు తమ తప్పును తాము గ్రహించే బాధ్యతను మరిచిపోయేలా చేస్తుంది. అందికే పిల్లలను కొట్టడం మూలంగా వారిని దారిలోకి తెచ్చుకోవడం మాటెలా ఉన్నా వారు మరింత ఎక్కువ దూరమయ్యే ప్రమాదముంది.

నీచమైన భాషను ఉపయోగించరాదు. ఒకరినొకరు శపించుకోవడం, అవమానించుకోవడం, న్యూనత పరుచుకోవడం, దెబ్బలాడుకోవడం చేయకూడదు.

తమ కుటుంబ సభ్యుల మధ్య సామరస్య పూర్వకమైన సంబంధ బాంధవ్యాలుండాలని పిల్లలు మనసారా కోరుకుంటారు. దీనికి భిన్నంగా ఏదైనా సంభవిస్తే పిల్లలు భరించలేరు. పిల్లలో నైరాశ్యం అలుముకోవడానికి కారణం వారి తల్లిదండ్రులెప్పుడూ పోట్లాడుకుంటూ ఉండడమేనని శాస్త్రజ్ఞులంటున్నారు. ఎంతోమంది పిల్లలు తమ తల్లిదండ్రులు పోట్లాడుకోకుండా ఉంటే చూడలనుందని తమను ఇంటర్వ్యూ చేసే మీడియా వ్యక్తులకు చెప్పారు. ఇంట్లో వాతావరణం ప్రశాంతంగా ఉండాలనేదే వారి కోరిక. తమ తల్లిదండ్రులు పోట్లాడు కోవడంగానీ లేదా వారు పదే పదే తమతో పోట్లాడడంగానీ వారికి సుతరామూ నచ్చదు. వారి దృష్టిలో పోట్లాడుకోవడమనేది ద్వేషానికీ, సామరస్యంగా ఉండడ మనేది ప్రేమకూ నిదర్శనం. కుటుంబసభ్యుల మధ్య ఒద్దిక కొరవడితే దానిని పిల్లలు తట్టుకోలేరు. ఫలితంగా తమ మనసుకు నచ్చే చోటుకు వెళ్లడం లేదా వ్యక్తులకు ప్రాధాన్యతనివ్వడం ప్రారంభిస్తారు. ఇది కొంతవరకు అందరితో (బయటి వ్యక్తుతో) కలిసిపోయే తత్వాన్ని కలిగించడానికి తోడ్పడుతుంది. ఈ మనస్తత్వాన్ని బయటి వ్యక్తులు ఒక అవకాశంగా తీసుకుంటారు. వారి మనసుకు నచ్చే ప్రేమ మాటలు చెప్పి, వారిని అనవసర ప్రేమ వ్యవహారాల్లోకి దింపే పరిస్థితి ఎదురవ్వొచ్చు. అందుచేత ఇంట్లోని వాతావరణం ఎప్పుడూ ప్రశాంతంగా ఉండాలి. తల్లిదండ్రులు ఒకరినొకరు పోట్లాడుకోవడం, తిట్లు శాపనార్థాలు పెట్టుకోవడం వంటివి చేయకూడదు.

తల్లిదండ్రులకు చెప్పకుండా, వారి అనుమతి లేకుండా పిల్లలు బయటికెళ్లకూడదు.

పిల్లలతో వ్యవహరించేటప్పుడు, వారిని దారిలోకి తెచ్చుకోవాలనుకునేటప్పుడు తల్లిదండ్రులు మరింత జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా టీనేజీ పిల్లల విషయంలో... వారికేం చెప్పినా అది వారి నమ్మకాన్ని గెలుచుకునేదిగా ఉండాలి. ఈ జాగ్రత్త రూల్సు విషయంలోనూ తీసుకోవాలి. ఏ కుటుంబంలోనైనా రూల్సనేవి అటు తల్లిదండ్రులకు, ఇటు పిల్లలకు వర్తించేలా ఉండాలి. ఇరు పక్షాలూ సరిసమానంగా పాటించేవిగా ఉండాలి. నిబద్ధతతో అనుసరించేలా ఉండాలి. పిల్లలకోసం తల్లిదండ్రులు కొన్ని పాటించినప్పుడు, పిల్లలూ తమ తల్లిదండ్రుల కోసం కొన్ని రూలు పాటించడానికి సంసిద్ధత చూపెడతారు. ఈ ధోరణి కుటుంబ వాతావరణంలో ప్రవేశపెట్టాలి. అందరూ దానికి కట్టుబడివుండే పరిస్థితిని కల్పించాలి. అప్పుడే పిల్లలూ ఈ రూల్సును గౌరవిస్తారు.

తాము విధిస్తున్న ఈ ఆంక్షల వెనుక పిల్లల పట్ల తమకు గల అపారమైన ఆపేక్ష అనే సంగతి వారికి స్పష్టమయ్యేలా ప్రతి తల్లిదండ్రులూ చూసుకోవాలి. పిల్లలు తమ అనుమతి లేకుండా ఎక్కడికైనా వెళ్లినట్టయితే... వారేమైపోతారో అనే గుబులే ప్రధానంగా తమను వేధిస్తుందని వారికర్థమయ్యేలా చెప్పగల్గాలి. అప్పుడే ఈ రూల్స్ వెనుక ఉన్న అసలైన ప్రేమను పిల్లలు తెలుసుకుంటారు. కుటుంబం పట్ల తమకు గల బాధ్యతను గుర్తెరిగి వీటిని పాటిస్తారు. ❖

సీరియల్

మాధవి

మూలం : అనుపమా నిరంజన

అనువాదం : వి. నాగరత్న



గాలవుడు విశ్వామిత్రుడికి చెల్లించాల్సిన గురుదక్షిణ కోసం యయాతి మహారాజు కుమార్తె, మాధవి సమిధ అయ్యింది. అయోధ్యరాజు హర్యశ్వుడికి, కాశీరాజు దివోదాసుకి చెరొక కొడుకుని కనిచ్చి, ఆ బిడ్డలను వదిలి ఒంటరిగా గాలవుడి వెంట బయలుదేరింది. అతగాడు మిగిలిన గుర్రాల కోసం ఆమెను మరో రాజుకర్పించేందుకు తీసుకెళుతున్నాడు.

(20వ భాగం)

పూవులు, కాయలు, వరుణుడు, వాతావరణం అంటూ గాలవుడు దేనిగురించి ప్రస్తావించినా మాధవి బొత్తిగా కల్పించుకోలేదు. తనను కాదన్నట్లు ముభావంగా నడుస్తోంది. మనిషి తిట్లనైనా సహించగలడు కానీ మౌనాన్ని భరించలేడు.

చూసీచూసీ "నీకు బాగా కోపమొచ్చినట్లుంది మాధవీ?!" అన్నాడు గాలవుడు.

మాధవి బదులు చెప్పలేదు.

"నీకు ఇంతకుముందు కూడా చెప్పాను... ఇందులో నా స్వార్థం ఏముంది చెప్పు, గురుదక్షిణ ఇచ్చేందుకేగా ఇంత యాతన పడుతోంది"

"తమరి గురుదక్షిణకోసం నన్ను పావుగా వాడుకోవడం న్యాయమా?"

"లక్ష్యం గొప్పదైనప్పుడు ఎవరైనా సిద్ధపడాల్సిందే. నీది, నాది అంటూ సంకుచితంగా ఆలోచించకూడదు"

'తెలివైనవారితో తర్కించవచ్చు, అజ్ఞానులకైతే నచ్చజెప్పొచ్చు. కానీ అటూఇటూకాని మిడిమిడిజ్ఞానులకు ఎవరు చెప్పగలరు? ఈ మూర్ఖుడితో మాట్లాడ్డం కూడా శుద్ధదండగ' అనుకుని చిరాగ్గా చూసి వూరుకుంది.

యాంత్రికంగా నడుస్తున్నారు. మధ్యమధ్యలో పండ్లు, కందమూలాలు తిని నీళ్ళు తాగుతున్నారు. చీకటివేళకి ఏ ఖాళీ ఆశ్రమంలోనో విశ్రాంతి తీసుకుని తిరిగి ఉదయం నడక సాగిస్తున్నారు. అనేక రోజులు గడిచాయి. అలా ప్రయాణిస్తూ ఒక ఋషి ఆశ్రమం చేరారు.

గాలవుడు విశ్వామిత్రుడి గొప్పతనాన్ని, తన గురుదక్షిణ ధ్యేయాన్ని గొప్పగా వర్ణించి మహర్షి ఆశీర్వాదాలు అందుకున్నాడు. మాధవిని ఋషిపత్ని లోనికి తీసికెళ్ళి వివరాలడిగింది. అంతావిని జాలిపడి "ఏమిటో ఇంత విడ్డూరం, దైవ నిర్ణయం అలా వుంది కాబోలు" అంది వేదాంతధోరణిలో.

రోజుల తరబడి నడిచి అలసిసొలసిపోవడాన గాలవుడి శరీరం కూడా శుష్కించిపోయింది. అందుకే విశ్రాంతి అవసరమని అతడు గుర్తించాడు. మూడురోజులు అక్కడే వుండిపోయారు.

ఆవేళ ఋషి తన శిష్యులకు ధర్మం గురించి హితబోధ చేస్తున్నాడు. రాజు ప్రజలను కన్నబిడ్డల్లా చూసుకోవాలని, యుద్ధరంగంలో అరివీర భయంకరంగా పోరాడి శత్రువులను తుదముట్టించాలని, మునులు తపస్సు చేస్తూ లోకకల్యాణంకోసం పాటుపడాలని సారాంశం.

ఆ మాటలు వింటూ ఆలోచనలో పడింది మాధవి. 'మరి స్త్రీ ధర్మమేంటో?! తండ్రికి, భర్తకి ఎదురుచెప్పకుండా వాళ్ళు ఎలా చెప్తే అలా నడచుకోవాలి కాబోలు. తన తండ్రి తనను మాట మాత్రం అడగకుండా గాలవుడిచేతిలో పెట్టాడు. అతడు గురుదక్షిణకు అవసరమైన గుర్రాలన్నీ సమకూరేవరకూ నిర్భయంగా, నిర్లజ్జగా తనను రాజులకు అప్పగిస్తుంటాడు. వాళ్ళ కామవాంఛలు తీర్చి, బిడ్డలను కనిచ్చి నిర్లిప్తంగా అక్కణ్ణించి వచ్చేయాలి. ఇదేం ఆటవికత? దీన్ని ఎవరూ అడ్డుకోరా? గాలవుడు జరిగిందంతా చెప్పినా సరే, మునులయ్యుండీ 'ఇదేం అన్యాయం? నువ్విలా చేయడం బాగాలేదు. ఆ అమ్మాయిని వేశ్యనుకుంటున్నావా ఏంటి? చేయకూడని తప్పు చేస్తున్నావు. ఆమె ఉసురుపోసుకుంటావు జాగ్రత్త' అని ఒక్కరైనా చెప్పి చూశారా? కనీసం తనతోనైనా 'బలిపశువులా అతణ్ణి అనుసరించనక్కర్లేదు, నువ్విక్కడ వుండిపో... ఏంచేస్తాడో చూస్తాం' అనగల్గారా? పోనీ వీళ్ళు కేవలం పరిచయస్తులు, తనతో సంబంధంలేదు. కానీ తనతో ఏడాదికిపైగా కాపురంచేసిన హర్యశ్వుడు, దివోదాసు రాజులయ్యుండీ గాలవుణ్ణి ఎదిరించారా? కన్నకొడుకును

"నల్లరంగు చెవి ఉన్న తెల్లటి గుర్రాలు ఎనిమిది వందలు నాకు గురుదక్షిణగా కావాలి" అన్న గురువు గారి కోరికను ఆ శిష్యుడెలా తీర్చాడో ఈ సీరియల్‌లో చదువుతున్నారు.

వదిలి వెళ్ళాల్సిన అగత్యమేంటి, మాధవిని ఇక్కడే వదిలి నీ గుర్రాలకోసం వేరే ప్రయత్నం చేసుకో అనలేకపోయారు.

అబ్బే అనరు. ఎందుకంటారు? మహాఅయితే కర్మ గురించి మాట్లాడతారు. పూర్వజన్మ సుకృతంవల్లే ఈ జన్మ దొరుకుతుందని, ఏదో పాపం చేస్తేనే ఇలా జరుగుతుందని మెట్టవేదాంతం వల్లిస్తారు. అంతకుమించి న్యాయాన్యాయ విచక్షణతో విచారించరు. గాయం తమది కానప్పుడు బాధ అనుభవంలోకి రాదు కాబోలు' అనుకుని నిట్టూర్చింది.

అక్కణ్ణించి బయల్దేరి ఇంకొన్నిరోజులు ప్రయాణించి కోసలదేశం చేరారు.

కోసలరాజు గాలవుడు చెప్పింది విని "మాది చాలా చిన్నదేశం. అలాంటి గుర్రాలు మా దగ్గర పాతికైనా వుంటాయో లేదో? ఇక్కడినుంచి పడమటిదిక్కుగా ఐదు యోజనాలు నడిస్తే ఒక కొండ వస్తుంది. ఆ కొండకు అటువైపు భోజదేశం వుంటుంది. ఆ దేశపు రాజు ఉశీనరుడు చాలా బలవంతుడు. ఆయన్ని కలిసి చూడండి, తప్పకుండా ఫలితం వుంటుందనుకుంటున్నాను. పోతే, మీ కోరిక తీర్చలేకపోయినా, ఇక్కడికొచ్చారు కనుక మా ఆతిథ్యం స్వీకరించి కొన్నిరోజులు వుండండి" అన్నాడు ఎంతో ఔదార్యంగా.

గాలవుడు ఆ ఆతిథ్యాన్ని సౌమ్యంగానే తిరస్కరించి ప్రయాణం కొనసాగించాడు.

✪ ✪ ✪

హర్యశ్వుడు, దివోదాసుల దగ్గర పరిచయం చేసినట్లే భోజదేశపు రాజు ఉశీనరుడి దగ్గర కూడా మాధవి గురించి చెప్పాడు. రెండొందల గుర్రాలకు గాను సంవత్సరంపాటు ఆమెని వుంచుకోమని చెప్పి గాలవుడు వెళ్ళిపోయాక రాజు ఆశ్చర్యంగా "కన్యాశుల్కంగా డబ్బునో, బంగారాన్నో, వజ్రవైఢూర్యాలనో అడగడం తెలుసు కానీ, ఇలా గుర్రాలను అడగడం ఎక్కడా వినలేదు. అదీ గురుదక్షిణ తీర్చడానికట" అన్నాడు పెద్దపెట్టున నవ్వుతూ.

"ఆ విశ్వామిత్రుడు అన్ని వందల గుర్రాలను ఏం చేసుకుంటాడు రాజా, కోసుకు తింటాడా ఏం?" మంత్రి విసుగ్గా అన్నాడు.

"అంతేనో... లేక శిష్యబృందాన్నేసుకుని ప్రపంచం చుట్టబెడదా మనుకుంటున్నాడో" అన్నాడు సేనాపతి.

ఉశీనరుడు ఉలిక్కిపడి, "ఊరుకోండి, మహర్షులకి దివ్యదృష్టి వుంటుందంటారు" అన్నాడు.

"నిజంగా ఆ శక్తే వుంటే మనసులో అనుకున్నది కూడా తెలుస్తుందిగా రాజా" అన్నాడు మంత్రి.

'ఎందుకైనా మంచిది, అసలా విషయాలేం ఆలోచించకూడదు' అనుకుని తిరిగి రాజకీయాలవైపు దృష్టి మళ్ళించి వాటిని చర్చకు తెచ్చాడు రాజు. తర్వాత పరివారంతో కలిసివెళ్ళి కోటను పరిశీలించి వచ్చాడు. అప్పటికి మధ్యాహ్నం పన్నెండయింది. ఎండలో రావడంతో ఒళ్ళంతా చెమటపట్టింది. సుగంధద్రవ్యాలు కలిపిన నీళ్ళతో స్నానంచేసి మహారాణి అంతఃపురానికి వెళ్ళాడు.

ఆవిడకు రాజుగారు తనదగ్గరకు వస్తారని ముందే తెలియడంతో ఆయనకు ఇష్టమైన పదార్థాలన్నీ సిద్ధంచేయించి వుంచింది. ఉశీనరుణ్ణి చూస్తూనే పళ్ళెంలో వేడివేడి వంటకాలను వడ్డించింది. రాజు సంతృప్తిగా తిని "సంతోషం దేవీ, నీ ప్రేమంతా భోజనంలో కుమ్మరించినట్లున్నావు, ఎంతో రుచిగా వుంది" అన్నాడు త్రేన్చుతూ.

మహారాణి దాన్నేం పట్టించుకోకుండా తాంబూలం అందిస్తూ "కొత్తగా ఓ రాజకుమారి వచ్చిందని విన్నాను" అంది ఏ భావమూ వ్యక్తం చేయకుండా.

గురుదక్షిణకు అవసరమైన గుర్రాలన్నీ సమకూరేవరకూ నిర్దయంగా, నిర్లజ్జగా తనను రాజులకు అప్పగిస్తుంటాడు. వాళ్ళ కామవాంఛలు తీర్చి, బిడ్డలను కనిచ్చి నిర్లిప్తంగా అక్కణ్ణించి వచ్చేయాలి. ఇదేం ఆటవికత? దీన్ని ఎవరూ అడ్డుకోరా?

"అవును, అప్సరసలా వుంది" అన్నాడు రాణీ నొచ్చుకుంటుందేమో అని కూడా ఆలోచించకుండా.

రాణీకి కోపం ముంచుకురాగా "ఈ వరసన రాచకన్యలను పెంచుకుంటూ పోతే ఈ అంతఃపురం సరిపోదేమో" అంది.

"చాలకపోతే మరి నాలుగు కట్టిస్తాన్లే, దాని గురించి బెంగపడకు.. ఇంకెప్పుడూ ఈ విషయమై మాట్లాడకు" మెల్లగానే చెప్పినా అది శాసనంలానే వుంది.

పక్కనున్న కిరీటం తలకు పెట్టుకుని, కండువా వేసుకుని 'వస్తానని' ఆవిడతో మాటమాత్రమైనా చెప్పకుండా అక్కణ్ణించి బయల్దేరి తిన్నగా మాధవికి ఏర్పాటు చేసిన మందిరంవైపు వెళ్ళాడు.

అప్పుడే తలస్నానం చేసిన గుర్తుగా మాధవి జుట్టును తుడుచుకుంటోంది. ఆ భంగిమలో మాధవిని చూసి 'అబ్బ, ఏం అందం నీది?' అనుకుని, "అంతా సౌకర్యంగా వుందా?" అనడిగాడు.

రాజుని చూసిన మాధవి నిలబడిందేగానీ బదులు చెప్పలేదు.

పక్కనున్న దానిని ఉద్దేశించి "రాకుమారికి ఏ ఇబ్బందీ రాకుండా కనిపెట్టివుండు" అన్నాడు.

"చిత్తం ప్రభూ" అంది దాసి.

అక్కణ్ణించి బయల్దేరి తన శయనమందిరానికి వెళ్ళి చెలికత్తెలు వింజామరలతో విసురుతుండగా హాయిగా పడుకున్నాడు. సాయంత్రానికి మెలకువ వచ్చేసరికి కొడుకు, కూతురు ఆడుకుంటూ కనిపించారు.

కొడుకు చేతిలో విల్లు-బాణం, కూతురి చేతిలో సంగీత సాధనాలు కనిపించడంతో ముసిముసిగా నవ్వుతూ, "ఏం కుమారా, ఇక్కడాడుకుంటున్నారు?" అన్నాడు ఉశీనరుడు.

ఇంతలో మహారాణి దగ్గర పనిచేసే దాసి కూడా కనిపించింది.

"నాన్నా, అమ్మ సాయంత్రం ఏదో పూజ చేస్తుందట, ప్రసాదం తీసుకోడానికి తప్పకుండా రమ్మని చెప్పింది" అన్నారు పిల్లలిద్దరూ ముక్తకంఠంతో.

'ఈ రాత్రికి మాధవి దగ్గరికెళ్తానని గ్రహించివుంటుంది మహారాణి. దాన్ని తప్పించాలని పూజ, వ్రతం అంటూ నాటకం కాబోలు.. ఉత్త నంగనాచి' అనుకుని "బాబూ, రాత్రికి నాకు చాలా పనులున్నాయి కనుక రాలేనని చెప్పు. మరోసారి వీలు చూసుకుని వస్తానులే" అని పిల్లలతో చెప్పి "నువ్వు, పిల్లల్ని తీసుకుని వెళ్ళు" అన్నాడు దాసి వైపు తిరిగి.

... ఇంకా ఉంది

మాధవి జీవనపయనంలో మూడవరాజైన ఉశీనరుడి భోజరాజ్యంలో ఎలాంటి ఆదరణ పొందింది?

పుత్రసంతానం అవసరంలేని ఉశీనరుడు మాధవిని ఉంపుడుగత్తె కన్నా ఎక్కువగా ఏం చూస్తాడు?

ఆదేశించడం తప్ప మరేమీ తెలియని ఆ రాజు దగ్గర ఆమెలా గడిపింది?

వచ్చే సంచికలో...

క్యాంపస్ ఛాట్

కె. శివలీల

> అతను బైక్ ఆపేశాడు. వెనక్కు తిరిగి నావైపే చూస్తున్నాడు. 'వీడీరోజు వదిలేలా లేడు' అనుకుంటూ చుట్టూ చూశాను. రోడ్డు పై జనం ఉన్నారు. 'పర్లేదు... అరిస్తే రెస్పాన్సొస్తుంది' అనుకుంటూ ముందుకు అడుగులేశాను. ఇప్పుడు సరిగ్గా అతని ముందుకొచ్చాను. ఊపిరిబిగబట్టి నడుస్తున్నాను.



ఫీలవ్వటమా... అదొకప్పటి మాట!

"టైం

ఎనిమిదవుతోంది... హాస్టల్ గేటు మూసేస్తారేమో... అనుకుంటూ వడివడిగా నడుస్తున్నాను. సన్నగా వర్షం పడడం ప్రారంభమైంది. నడక వేగం పెంచాను. ఇంతలో... ఓ బైక్ స్లోగా నా పక్కనుంచి వెళుతోంది. దాదాపు నన్ను రాసుకుపోతుందేమో అన్నంత దగ్గరగా వచ్చింది. నేను కోపంగా ఏదో అనబోయేంతలో... ఆ బైక్‌వాలా... "హాయ్ డార్లింగ్ లిఫ్ట్ కావాలా?" అంటూ ప్రశ్నించాడు. అసలే హాస్టలుకు త్వరగా వెళ్లాలన్న టెన్షన్‌లో నేనుంటే... మధ్యలో వీడెవడ్రా బాబూ... అనుకుంటూ... "పర్లేదు డార్లింగ్...నీకెందుకు రిస్కు నేను వెళ్లగలను" అని నేనతన్ని సూటిగా చూస్తూ... వెంటనే సమాధానమిచ్చాను. అతని బైక్ అదే వేగంతో ముందుకెళుతోంది. కొద్దిదూరం అలాగే వెళ్లాక అతను బైక్ ఆపేశాడు. వెనక్కు తిరిగి నావైపే చూస్తున్నాడు. 'వీడీరోజు వదిలేలా లేడు' అనుకుంటూ చుట్టూ చూశాను. రోడ్డు పై జనం ఉన్నారు. 'పర్లేదు... అరిస్తే రెస్పాన్సొస్తుంది' అనుకుంటూ ముందుకు అడుగులేశాను. ఇప్పుడు సరిగ్గా అతని ముందుకొచ్చాను. ఊపిరిబిగబట్టి నడుస్తున్నాను. అతను చాలా మర్యాదగా "మామ్... నేను మిమ్మల్ని 'డార్లింగ్...' అని పిలిచాను కదా... మీకు కోపం రాలేదా...? నన్ను తిట్టలేదేంటి?" అని అడిగాడు. 'నీలాంటి వాళ్లందరూ అనే మాటలకు సీరియస్సయి... నా బీపీ రైజ్ చేసు కోవడ మెందుకు? లైట్‌గా తీసుకోవాలి బాబూ' అన్నాను. అంతే... అతను మరొక్క మాట మాట్లాడలేదు. బైక్ స్టార్ట్ చేశాడు. వెనక్కి చూడకుండా రయ్ మంటూ వెళ్లిపోయాడు" అని చెబుతున్న సుశీ పీజీ ఫస్టియర్ చదువుతూ ఓ ప్రైవేటు కంపెనీలో పార్ట్‌టైంగా జాబ్ చేస్తోంది.

'అప్పటి కీ ఇప్పటి కీ అమ్మాయిల్లో ఎంత తేడా' అనుకుంటున్నారు కదూ. ఇక... ఐసిడబ్ల్యూఏఐ స్టూడెంట్ సంధ్య అనుభవాన్ని చదివితే... 'ఔరా' అనుకుం టారేమో....

"నేను నా స్నేహితురాలు సంగీత కలిసి కాలేజీకెళ్లేవాళ్లం. చేతిలో ఉన్న పుస్తకాలనలాగే పట్టుకుని, భుజంపై పెట్టుకున్నాను. అది మా పక్కింటబ్బాయి చూశాడు. 'యముండ... యముండ' అంటూ కామెంట్ చేయడం మొదలెట్టాడు. కొన్ని రోజులకు అతను నన్నే కామెంట్ చేస్తున్నాడని మాకర్థమైంది. ఆ రోజు... మేం వాళ్లింటి ముందునుంచి వెళుతుంటే... అతను ఎప్పటిలాగే 'యముండ' అని అరిచాడు. 'నేనే యముడినైతే... ఇలాంటి వాళ్లనెప్పుడో పైకితీసుకెళ్లిపోయేదాన్ని' అని నేను అతనికి వినిపించేట్లుగా అన్నాను. ఏమైందో ఏమోగానీ ఆ మరుసటి రోజు నుంచి 'వదినా... వదినా' అంటూ పిలవసాగేడు. నాకు కోపమొచ్చింది. 'నీ అన్నను పిలువు బే... లైనేసుకుంటా'అని కోపంగా అరిచాను. అదే సమయంలో... ఇంట్లోంచి వాళ్లన్న బయటికొచ్చాడు. వాడు బిక్కచచ్చిపోయాడు. ఇక ఆ తరువాతెప్పుడూ మేం కాలేజీకెళ్లే సమయంలో వాళ్లింటి ముందతను కనిపించనేలేదు" అని చెబుతోంది సంధ్య.

ఫ్రెండ్సందరమూ కలిసి గ్యాంగ్‌లా వెళ్లినా సమస్యలు తప్పవంటోంది అనూహ్య. ఎలాగో తెలుసుకోవాలనుందా... "మేమంతా ట్యాంక్‌బండ్ మీదుగా నడుస్తూ వస్తుంటే... బైక్ మీద వెళుతున్న ఇద్దరబ్బాయిల్లో... వెనుక కూర్చున్నతను అలాగే వెనక్కు తిరిగి మా వైపు చూస్తూనే ఉన్నాడు. ఇది వరకు రోజుల్లో ఇలాంటి వాళ్లనే 'మూవీ కెమేరా' అని పిలిచేవాళ్లు. బైక్ ముందుకు దూసుకెళుతోంది. అతను పొజిషన్ మాత్రం మార్చలేదు. మా గ్యాంగ్‌లో ఉన్న నవనీత "ముందుకు చూడు బే... వెనకేముంది" అని గట్టిగా అరిచింది. అది వాళ్ల చెవిన పడిందేమో... వేగంగా వెళుతున్న బైక్ సడెన్‌గా ఆగిపోయింది. రివర్సయింది. మాకెదురుగా వస్తోంది. నలుగురం భయపడిపోయాం. మా పై ప్రాణాలు పైనే పోయాయి. వెనక్కుతిరిగి వెళ్లిపోదామనుకున్నాం. ఏంటి నీ ప్రోబ్లెం. మేం చూసినంత మాత్రాన నీ సొమ్మేం పోయింది' అని గద్దిస్తున్నాడు వాళ్లలో ఒకడు.

"ఏయ్ మిస్టర్... ఏంటీ బైక్ రివర్స్ చేశావ్. వణికిపోతామనుకుంటున్నావా? ఎక్కువ తక్కువ మాట్లాడితే పోలీస్ కంప్లయింట్ ఇవ్వగలను జాగ్రత్త" అని గట్టిగా అంది నవనీత. దాంతో వాడు తగ్గి "సారీ మేడం" అని చెప్పి వెళ్లిపోయాడు. అందరం 'హమ్మయ్య'అనిఊపిరి పీల్చుకున్నాం.

అబ్బాయిలు కామెంట్ చేస్తే... అమ్మాయిలు బాధపడడం ఒకప్పటిమాట. ఈ రోజుల్లో చాలా మంది అమ్మాయిలు ఈ విషయాన్ని లైట్‌గానే తీసుకుంటున్నారు. అలాగని వదిలిపెడితే విషయమింకొంచెం స్పీడవుతోంది. ఒక్కోసారిలా మాటకుమాట అంటించకపోతే కష్టం. "మా ఫ్రెండ్స్‌తో కలిసి బయటికెళితే... అబ్బాయిలనే బాగా కామెంట్ చేస్తాం. ఎందుకంటే... అంతమందిలో వాళ్లను కామెంట్ చేసిందెవరో వాళ్లు తెలుసుకోలేరుగా..." అని చాలా మంది కాలేజీ అమ్మాయిలు హుషారుగా చెప్తున్నా... ఇది అన్ని సందర్భాలలోనూ సాధ్యపడదని ఒప్పుకుంటున్నారు. అదే సమయంలో ఎవరైనా కామెంట్ చేస్తే... వాళ్ల తల తిరిగిపోయేట్లు సమాధానమివ్వకుండా ఊరుకోబోమని తెగేసి చెబుతున్నారు.

సినిమా కబుర్లు

నేను కూడా ఒక పదిమందిని కొట్టే హీరో అవుదామని అనుకునుంటే రాజేంద్రప్రసాద్ అనే హీరో ఈరోజు ఉండేవాడు కాదు. నా వంటికి, నా ఫేస్‌కి, ఏది ఫిట్ అవుతుంది, నేను దేనికి పనికొస్తానో నాకు నేనుగా సెలెక్ట్ చేసుకున్నాను కాబట్టే "రాజేంద్రప్రసాద్ ఒక స్పెషల్ హీరో" అనిపించుకున్నాను.

చందు

డెసిషన్ మేకింగ్ ముఖ్యం. రెగ్యులర్ సినిమాల్లో 'ఎదురింటి మొగుడు పక్కింటి పెళ్ళాం' లాంటి హీరో ఉంటాడా? అలాగే 'అప్పుల అప్పారావు' లాంటి హీరో ఉండడు. 'పేకాట పాపారావు' లాంటి హీరో ఉండడు. 'ఆ ఒక్కటీ అడక్కు'లో లాంటి హీరో ఉండడు. ఇవన్నీ నిజ జీవితంలోంచి వచ్చినవే. 'జమజచ్చ' అంటూ పుట్టుమచ్చ అదృష్టాన్నే నమ్ముకున్న పాత్ర 'లేడీస్ టైలర్' సినిమాలోది. ఇలాంటివన్నీ నెగిటివ్ ఓరియెంటెడ్ హీరోయిజమ్స్. జీవితంలో ఏవేవి నెగిటివ్‌లు ఉన్నాయో వాటి నుంచి హీరోయిజంకు మార్చబడినటువంటి కథలు ఇవి. నేనొక పదిమందిని కొట్టే హీరో అయినట్లయితే ఈ పాత్రలను చేయగలిగేవాడినా? అసలు ఇలాంటి పాత్రలు వచ్చేవా? ప్రత్యేక ముద్ర వచ్చేదా? రాజేంద్రప్రసాద్ సినిమాలు నిజజీవితంలోంచి వచ్చాయనిపించుకున్నాను. నేను వేసిన పాత్రలు ఎవరికి వారిని చూసుకున్నట్లుంటుంది. ఒక అప్పుల అప్పారావు మన ఇంట్లో లేకపోతే పక్కింట్లో ఉంటాడు. మన ఊర్లో లేడీస్ టైలర్ లేకపోతే పక్కూరులో ఉన్నాడన్న మాట.



నేనో స్పెషల్ హీరోని

చార్లీచాప్లిన్‌లో నాక్కావాల్సింది వెతుక్కున్నాను

ఏం చేస్తే ఏం అవుతుందో మనకి తెలుసు... మనం ఏ స్థితిలో ఉన్నామో కూడా మనకి తెలుసు... కానీ మనం దాన్ని గుర్తించడం లేదు. ఎవరికి వాళ్ళే నిర్ణయాధిపతులు. మన చుట్టూ మంచీ ఉంది. చెడూ ఉంది. ఏది మంచో, ఏది చెడో ఆలోచించుకుని ముందుకు సాగాలి. నా లాంటి హీరో ఎలా దొరికాడు. అసలు రాజేంద్రప్రసాద్ హీరో ఎందుకయ్యాడు. రాజేంద్రప్రసాద్ లాంటి వాడికి ప్రత్యేక గుర్తింపు ఎందుకొచ్చింది" అంటే... మన మొహం ఒకసారి అద్దంలో చూసుకున్నాం. రెగ్యులర్ హీరోగా పనికి రాను. ఇంజనీరింగ్‌లో ప్రథమ శ్రేణిలో పాసయ్యాను. ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో గోల్డ్ మెడల్ సంపాదించాను. ఏం చేయాలి? డెసిషన్ పాయింట్‌కి వచ్చేసరికి జీవితంలో ఉన్న అవకాశాలు వెతుక్కుంటాం కదా! అసలు వెతికితేనే కదా ఉద్యోగం వచ్చేది. అదే సమయంలో చార్లీచాప్లిన్ ఫిలిం ఫెస్టివల్ చూశా. హమ్మయ్య దొరికేశాడు. "రాజేంద్రప్రసాద్ ఇలాంటి రోల్స్‌కి పనికొస్తాడు" అని నాకునేను అనుకున్నాను. అక్కడి నుండి



దొరికిన అవకాశాన్ని మిస్ చేయకుండా సపోర్టింగ్ రోల్స్‌లో మంచి పేరు తెచ్చుకుంటే 'లేడీస్ టైలర్'లో అవకాశం వచ్చింది. ఒక ఫుల్ లెన్త్ కామెడీ సినిమాను కమర్షియల్ హిట్ రేంజ్‌కి "లేడీస్‌టైలర్" తీసుకెళ్ళింది. దీంట్లో చక్కని ప్రతిభను కనబరిచాను కాబట్టే 'అహనా పెళ్ళంట'లో అవకాశమొచ్చింది. ఇక అక్కడి నుంచీ ఒక్కొక్కటీ వరసగా వచ్చాయి. రాజేంద్రప్రసాద్ సినిమాలే టీవీలో అన్నిసార్లు ఎందుకేస్తారు అంటే కారణం ఒక్కటే... ఏ విషయాన్నీ సీరియస్‌గా తీసుకోపోతే మెచ్యూరిటీ వచ్చినట్లే. ఎప్పుడైతే పరిణితి వచ్చిందో అప్పుడు కామెడీ వస్తుంది. నా జీవిత సంఘర్షణలోంచి కామెడీ వచ్చింది. ఆ సంఘర్షణలోంచి వచ్చిన కామెడీ శాశ్వతంగా నిలుస్తుంది.

కంఠీరవ రాజ్‌కుమార్ గారింటికెళ్తే...

'మిస్టర్ పెళ్ళాం', 'పెళ్ళి పుస్తకం' సినిమాలను భార్యాభర్తలు చూస్తే, వాటిని వారు జీవితంలో మరచిపోవడం జరగదు. అంత గుర్తింపు ఉన్న పాత్రలవి. నన్ను ప్రేరణగా తీసుకుని చాలామంది ఆర్టిస్టులు కామెడీ చేయాలని అనుకోవడం నా జీవితంలో గర్వించదగ్గ విషయం. రాజేంద్రప్రసాద్ చనిపోయిన తర్వాత ఇవి ఇంకా చాలా పనికొస్తాయి. సమాజానికి ఇంకా దగ్గర అవుతాయి. ఏం చదివారని అడిగితే డిగ్రీయో, పీజీయో చేశామని చెబుతాం. దీనికి ప్రమాణం సంబంధిత సర్టిఫికేట్, మెడల్స్... నాబోటి ఆర్టిస్టుకి ఏంటంటే? 'మిమ్మల్ని చూసి ఇంతమంది తయారవుతున్నారండీ... మీ సినిమాలతో ప్రేరణ చెంది మిగతా సినిమాలన్నీ ఇలాగే తీస్తున్నారండీ...' అంటారు. ఇంతకన్నా ఆర్టిస్టుకు కావల్సింది ఏముంది? ఎవరింటికెళ్ళినా, అమెరికా, ఆస్ట్రేలియా, దుబాయ్ ఎక్కడికెళ్ళినా 'మీ సినిమా సీడీలు ఎన్ని ఉన్నాయో చూడండి సార్' అని చూపిస్తుంటారు. నటుడికి ఇదొక పెద్ద మార్క్. కన్నడ కంఠీరవం రాజ్ కుమార్ గారింటికెళ్తే ఆయన గదిలోకి తీసుకెళ్ళి 'మనసు బాగోనప్పుడు నీ సినిమాలే వేసుకుని చూస్తాను' అని వీడియో క్యాసెట్స్ చూపించారు.

వచ్చేవారం కూడా...

చిన్నారి చిత్రకారులు

కోడూరు వెంకటలక్ష్మి, 10వ తరగతి, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, నిడుమోలు, కృష్ణా.

బాలల దినోత్సవం సందర్భంగా 'చిన్నారి'లో నిర్వహించిన చిత్రలేఖనం పోటీ విజేతలు

కటారి తిరుపతి స్వామి, 9వ తరగతి, తాలూకా హైస్కూల్, బి.సి.హాస్టల్, కొత్తపేట, తెనాలి.

ఎవరై వుంటారబ్బా?



బుజ్జాయిలూ! పైన ఎవరో తామరాకుమీద దర్జాగా కూర్చుని మిమ్మల్నే చూస్తున్నారు. వారికి మీతో మాట్లాడాలని తెగ ఉబలాటంగా వుందంట. చుక్కలు కలిపితే వారికి మాటలు కూడా వస్తాయంట. అప్పడు మనకు కూడా వారెవరో ఇట్టే తెలిసిపోతుందికూడా. మరి ఆలస్యం ఎందుకు? వెంటనే పెన్నో పెన్సిలో తీసుకుని చకచకా వరుసగా చుక్కలు కలిపేస్తే ఓ పనైపోతుంది. వారి ముచ్చట కూడా తీరుతుంది.

కత్తిరించండి! అతికించండి!!



హేయ్! ఇక్కడ ఏదో పక్షి శరీర భాగాలు వున్నట్టున్నాయి కదూ. అవి ఓ చిన్నారి కోడిపిల్లవి. వాటిని కత్తిరించండి. రంగులేయండి. తర్వాత ఓ కాగితంమీద వైనంగా అతికించండి. చిక్ అదిరిపోతుంది.



ఎడారిని దాటడమెలా!



రంగులు పులిమితే....

6.11.05కు సరైన సమాధానాలు రాసినవారు

కె.రవినాయక్ (8), బాలనగర్. వి.సుమంత్ (6), నెహ్రూ హైస్కూల్, అద్దంకి. కె.మణిదీప్ (9), జిహెచ్ స్కూల్, టంగుటూరు, ప్రకాశం. తుర్లపాటి సాంబశివరావు(6), జడ్‌పిహెచ్ స్కూల్, వేల్పూరు, గుంటూరు. ఆర్.సంధ్యారాణి (5), టి.మానస (5), సిహెచ్.సుమన్ (5), ఎన్.మౌనిక (5), మం.ప్రాథమిక పాఠశాల, సిహెచ్ నాగరాజు (8), ఆర్.వంశీకృష్ణ(6), జడ్‌పిహెచ్ స్కూల్, చల్లా వినీల (5), వి.మురళీకృష్ణ(5), చైతన్య పబ్లిక్ స్కూల్, ఎన్.హనుమాన్ (8), శ్రీ సాయి పబ్లిక్ స్కూల్, మొగల్లూరు. శ్రీలేఖ (6), సాయి తేజ స్కూల్, కోరలగుంట, తిరుపతి. మాదాల సింగరకొండ(7), మద్దినేని రమ్య (6), జడ్‌పిహెచ్ స్కూల్, వేల్పూరు, గుంటూరు. పి.రేవంత్ (7), సిఎస్ఐ మిషన్, ఏటూరునాగారం. తేజావతు శ్రీనివాస్, కురవి. యస్.శృతి (8), నక్కలగుట్ట, హన్మకొండ. రాళ్లబండి సాయికిరణ్ (4), విశ్వశాంతి హైస్కూల్, శ్రీరాంపూర్. టి.వి.ఎల్.నాయక్, శ్రీ వాణి విద్యాలయం, జనగాం, వరంగల్. పొత్తూరి నీహారిక (9), భాష్యం పబ్లిక్ స్కూల్, సంతోష్‌నగర్, హైదరాబాద్. కె.లక్ష్మి (7), జడ్‌పిఎస్ఎస్, చెన్నూర్, వరంగల్. కె.ఉపేంద్రరావు (10), జగ్గయ్యపేట, కృష్ణా. టి.ప్రశాంత్‌కుమార్, మ్యాదరివాడ, కరీంనగర్. కూనిరెడ్డి కృష్ణారెడ్డి(10), వికాస్ రెసిడెన్షియల్ స్కూల్, గురజాల. కె.శ్రీతన్మయ (3), బ్రాడీపేట, గుంటూరు. కె.మధు (7), గురుకుల పాఠశాల, తుంగతుర్తి, నల్లగొండ. చిలకలపూడి చంద్రిక (6), భాష్యం పబ్లిక్ స్కూల్, సత్యనారాయణపురం, విజయవాడ. ముంద్రు మస్తానమ్మ(7), ముంద్రు మనోహర్ (7), ఆలపాటి రాజేష్ కుమార్ (6), ముంద్రు హేమలత (9), ముంద్రు రాజ్యలక్ష్మి (10), జడ్‌పిహెచ్ స్కూలు, వడ్లమూడి మనీషా (5), మహేష్ కాన్వెంట్, వేల్పూరు, గుంటూరు. జి.శ్రీలక్ష్మి (8), జవహర్ నవోదయ విద్యాలయం, కొమ్మడి, విశాఖ. యం.సంతోష్ నాయక్ (9), రాజానాయక్ తండ, తిరుమలగిరి. చిలకలపూడి హారిక (4), శ్రీ తేలప్రోలు రాజా ఇంగ్లీషు మీడియం హైస్కూలు, విజయవాడ. సిహెచ్.వసంత్ కుమార్ (9), సహాయమాత స్కూల్, ముదినేపల్లి, కృష్ణా. కార్యానా ఆరీఫ్ (7), వినుకొండ, గుంటూరు. నల్లగొండ లక్ష్మణ్ (10), జేసు హృదయ హైస్కూలు, తల్లాడ, ఖమ్మం. కావిల వళిని, పెద్దగదిలి, విశాఖ. కె.శంభిరెడ్డి (10), కె.రాజశేఖర్ రెడ్డి (8), పి.మనోజ్ రెడ్డి (10), ఎన్.శ్రీనివాస్‌రెడ్డి (10), సిద్ధార్థ రెసిడెన్షియల్ హైస్కూల్, కోదాడ, నల్లగొండ. కె.మహేష్ (6), దెబ్బడుగూడ, రంగారెడ్డి. నిశాంత్ రాయ్ (5), పాస్కల్. *బాబు నరేంద్రప్రసాద్, (8), కె.విజయ్ కుమార్, (10), బి.రవితేజయాదవ్, (10), ఎస్. కవీంద్ర, (10), యు.ఎస్ అనిల్, (10), నరసింహులు, (10), షబ్బీర్ హుస్సేన్, (10), యు.ఈరన్న, (10), ఆర్.రంజాన్, (10), యు.ఎం అనిల్, (10), యం ప్రసాద్, (10), యు. రాజశేఖర్, (10), యం.అనుదీప్, (10), జి నాగేష్, (10), కె.యం .యాసిన్, (10), జి. విజయ్ ప్రకాశ్, (10), యం. తిమ్మప్ప, (10), యు. నాసిర్, (10), యం. రాజేష్, (10), బి.శ్రీనివాసులు (10), బి.రవి (10), యం.రమేష్ (10), జి.సునందపవన్ (10), యు.యం.డి.నాసిర్ (10), వి.మంజునాథ్(10), కె.మజార్‌హుస్సేన్(10), కె.రఘువీర(10), యు.భీమలింగ(10), శ్రీవేణు విద్యాలయం, లక్ష్మీపేట, ఎమ్మిగనూరు.*

వీరి వీరి గుమ్మడి పండు వీరి పేరేమి?

హలో! ఈ వారం వీరి వీరి గుమ్మడి పండులో వచ్చినదెవరో చెప్పకోండి చూద్దాం. చెప్పలేరా! పోనీ ఓ హింట్ ఇవ్వమంటారా! మన దేశానికి ప్రధానమంత్రిగా చేసిన తొలి మహిళ ఈమె. కాకపోతే బాగా చిన్నప్పటిదీ ఫొటో. తెల్సిపోయినట్టుందే. వెంటనే కార్డుమీద సమాధానం రాసి పోస్ట్ చెయ్యండి. మా చిరునామా: **వీరి వీరి గుమ్మడి పండు,** బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్.

13.11.05 సమాధానం: జవహర్‌లాల్ నెహ్రూ

అట్టమీది కథ

ఆ పదహారు రోజులు ! అనగానే పెళ్లి నాటి పదహారు రోజుల పండగ గుర్తొస్తోందా? మలయాళ సినిమాకు పెట్టిన తెలుగు పేరనుకుంటున్నారా? కానేకాదు. నవంబరు 25 నుండి డిసెంబరు 10 వరకు "ఇంకానా ! సాగనివ్వొద్దు !! మేలుకో సోదరీ మేలుకో " !!!

అంటూ ఓ మేలుకొలుపు కార్యక్రమం అంతర్జాతీయంగా జరుగుతోంది.

ఎం. కోటేశ్వరరావు

ఇంకానా! సాగనివ్వొద్దు!!

మేలుకో సోదరీ మేలుకో



పుడుతూ తెచ్చేదేమీ లేదంటారు. కానీ ఆడదానికి పుట్టుకతో పాటు హింస కూడా వెన్నంటి రావటాన్ని ఏమంటారు? హింసకు ఆడామగా తేడా ఉందా? లేదంటే ఆడదై పుట్టటమే నేరంగా, ఒక శాపంగా ఎందుకు బతకాల్సి వస్తోంది. అడుగడుగునా హింసాకాండకు ఎందుకు గురికావాల్సి వస్తోంది. నిత్యం భయం నీడలో బతికే ఆడదానికి నిజమైన స్వేచ్ఛ ఉన్నట్లు ఎలా అవుతుందని ప్రశ్నించిన ఐరాస ప్రధాన కార్యకార్యదర్శి కోఫీ అన్నన్ అన్నట్లు ఎంతకాలమిలా బతకాలి? ఎందుకీ దురాగతం? సమాజం సమాధానం చెప్పాలి. చెప్పకపోతే........? చెప్పిద్దాం రండి. ఆ పదహారు రోజులనుండైనా మేలుకుందాం, అన్యాయాలను ఎలుగెత్తి చాటుదాం, అక్రమాలను అడ్డుకుందాం.

ఆ పదహారు రోజులే ఎందుకని?

లింగపరమైన హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయంగా మహిళలు పదహారు రోజుల పాటు పలు కార్యక్రమాలు నిర్వహించాలని పద్నాలుగు సంవత్సరాల క్రితం అనేక మహిళా సంఘాలు, బృందాలు నిర్ణయించాయి. వారిని అందుకు పురికొల్పిందేమిటో తెలుసా? కెనడాలోని మాంట్రియల్ పట్టణంలో 1989 డిసెంబరు ఆరవ తేదీన ఒక ఇంజనీరింగ్ కాలేజీలోకి ఒక యువకుడు ప్రవేశించాడు ఒక తరగతిలోకి వెళ్లి అబ్బాయిలు, అమ్మాయిలు విడివిడిగా నిలబడాలని తుపాకి చూపి బెదిరించాడు. నాకు స్త్రీ వాదులంటే ద్వేషం అంటూ విచక్షణా రహితంగా అమ్మాయిలపై కాల్పులు సాగిస్తూ ఉన్మాదిలా మారి మూడంతస్తులలోని తరగతుల్లోకి పరుగులుతీస్తూ మారణకాండ సాగించాడు. చివరకు తనను తాను కాల్చుకొని చచ్చాడు. ఇంజనీరింగ్ విద్య చదివేందుకు ప్రయత్నించి రెండు మార్కులు తక్కువ కారణంగా సీటు రాక విఫలమయ్యాడు. తనకు అవకాశం రాకపోవటానికి కారణం అమ్మాయిలు చదువుకోవటమే అన్న దురభిప్రాయానికి లోనయ్యాడు. చివరికి స్త్రీ ద్వేషిగా మారి ఆ రోజు 14 మంది అమ్మాయిల్ని హతమార్చాడు. మరో 13 మంది గాయాలతో బతికి బయట పడ్డారు. ఆ దురంతమే పదహారు రోజుల మేలుకొలుపు ఉద్యమానికి నాంది. ప్రతి ఏడాది ఒక్కొక్క అంశంపై కేంద్రీకరణ జరుగుతుంది. ఈ ఏడాది '**మహిళల ఆరోగ్యమే ప్రపంచ ఆరోగ్యం**'గా పాటించాలని పిలుపు ఇచ్చారు.

ఇంతకూ పదహారు రోజుల మేలుకొలుపు నవంబరు 25 నుండి డిసెంబరు పది వరకు ఎందుకు జరపాలో కూడా తెలుసుకోవద్దా ! లాటిన్ అమెరికాలో డొమెనికన్ రిపబ్లిక్ అనే దేశం ఉంది. నలభై ఐదేండ్ల క్రితం రాఫెల్ ట్రుజిలో అనే నియంతపాలనకు వ్యతిరేకంగా అనేక మంది ఉద్యమాలు నిర్వహించారు. వారిలో పాట్రియా, మినెర్వా, మరియా తెరెసా అనే ముగ్గురు అక్క చెల్లెల్లు ఉన్నారు. వారి భర్తలతో పాటు అనేక సార్లు ప్రభుత్వ వ్యతిరేక చర్యలు నిర్వహించి జైలు పాలయ్యారు. ఒకసారి అంటే 1960 నవంబరు 25న జైలులో ఉన్న తమ భర్తలను చూసేందుకు రుఫినో డిలా క్రజ్ అనే కార్యకర్తతో కలిసి జైలుకు వెళ్లారు. వారిని వెంటాడిని నియంత రహస్య పోలీసు బృందం వారు నలుగురిని హత్య చేసింది. అప్పటికే జనంలో పేరున్న ముగ్గురు సోదరీ మణుల హత్య ఉదంతం తెలియగానే జనంలో ఆగ్రహావేశాలు చెలరేగాయి. నియంతకు వ్యతిరేకంగా ఉద్యమం ఉధృతమైంది. మరుసటి ఏడాది మే 30న ట్రుజిలో హత్యకు గురయ్యాడు. తరంవాత అనేక మంది మహిళలకు ఈ ముగ్గురు సోదరీ మణుల త్యాగం స్ఫూర్తి నిచ్చింది.

వారు అమరులైన రెండు దశాబ్దాలకు కొలంబియాలోని బగోటాలో 1981లో జరిగిన లాటిన్ అమెరికా మహిళా సంఘాల సమావేశం నవంబరు 25ను ప్రతి ఏటా మహిళలపై హింస వ్యతిరేక దినంగా జరపాలని పిలుపు నిచ్చింది. ఐక్యరాజ్య సమితి 1999లో అధికారయుతంగా దానిని ఖరారు చేసింది. డిసెంబరు పదవ తేదీని అంతర్జాతీయ మానవహక్కుల దినంగా పాటిస్తున్నందున ఈ రెండు తేదీల మధ్య మహిళలను జాగ్రతం చేసేందుకు 16 రోజుల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఎవరైతేనేం...దెబ్బలకు కొదవా, హింసకు కరువా?!

రంగు, జాతి, మతం, ధనిక, పేద తేడా లేకుండా సర్వవ్యాపితంగా ఉన్న హింసాకాండ ఏదైనా ఉందంటే అంది లింగపరమైనదే. ఆఫ్రికా అయినా అమెరికా అయినా.... నిరక్షరకుక్షి అయినా డిగ్రీల మీద డిగ్రీలున్నా హింసకు గురికాని ఆడది లేదనటం, గురిచేయని మగాడు దొరకడనటం అతిశయోక్తి కాదేమో ! ఐక్యరాజ్య సమితి 2005 నివేదిక ప్రకారం 'ప్రపంచంలో ప్రతి ఐదుగురు మహిళల్లో ఒకరు తన జీవిత కాలంలో అత్యాచారయత్నానికి లేదా అత్యాచారానికి గురౌతున్నారు.ప్రతి ముగ్గురిలో ఒకరు కుటుంబ సభ్యుల చేతిలో దెబ్బలు తినటమో, సెక్స్ కొరకు వత్తిడి చేయటమో, ఇతరత్రా అవమానాలకు గురికావటమో జరుగుతోంది.' లింగపరమైన హింస వలన జరిగే నష్టం కూడా అంతా ఇంతా కాదు. దానిని కూడా ఆడదే భరించాలి. మన దేశంలో హింసకు గురైన ప్రతి మహిళ సగటున ఏడురోజులు పనికి దూరం అవుతోంది. చిలీలో జాతీయాదాయంలో రెండు శాతం నష్టపోతున్నారు. ఆస్ట్రేలియాలో బిడ్డలను కనే వయస్సులో హింసాకాండకు గురవుతున్న యువతులకు వచ్చే ఆరోగ్య సమస్యల కారణంగా ఏడాదికి 630 కోట్ల డాలర్లు నష్టం. అమెరికాలో 1260 కోట్ల డాలర్లు. ఇలా ప్రపంచవ్యాపితంగా ఈ సమస్య ఉన్నందునే ఆడదన్న తరువాత మొగుడి చేతిలో దెబ్బలు తినకుండా ఉంటుందా? మొగుడన్న తరువాత ఎప్పుడన్నా ఒక దెబ్బ వేయకుండా ఉంటాడా? తప్పు చేసిన ఆడదాన్ని మొగుడు చూస్తూ ఊరుకుంటాడా? ఇదేం చోద్యం ? అని ప్రశ్నించే వారు, బుగ్గలు నొక్కుకునే అమాయకపు ఆడవాళ్లు కూడా మనకు గణనీయంగానే కనిపిస్తారు. అలాంటి వారిలో ప్రతి ఏడాది నూటికి ఒక్కరిని మేలు కొల్పినా సమాజానికి ఎంతో మేలు జరుగుతుంది.

గృహం... కారాగృహం కారాదు కదా!



గృహ హింసకు పాల్పడుతున్న వారు భర్త, ఇతర కుటుంబ సభ్యులో, బాగా తెలిసినవారో ఎక్కువగా ఉంటున్నందున అది కుటుంబ వ్యవహారం గానో, "భార్యాభర్తలు కొట్టుకుంటారు తిట్టుకుంటారు మనకెందుకు మధ్యలో" అని భావించే వారు ఇప్పటికీ గణనీయంగా ఉన్నారు. కానీ ఐక్యరాజ్య సమితి ఇలాంటి హింసను కూడా గత దశాబ్దకాలంగా మానవ హక్కుల ఉల్లంఘనగానే పరిగణిస్తోంది. బీజింగ్‌లో జరిగిన నాలుగవ ప్రపంచ మహిళా సభ (1995) కూడా దీనిని గుర్తించింది. లింగపరమైన సమానత్వం, మహిళా సాధికారతకు ఇది మూల సమస్య అని పేర్కొన్నది. అసలు లింగపరమైన హింసంటే ఏమిటి?

హింస ఇంకెన్ని రూపాలో...

లింగపరంగా అంటే భౌతికంగా, మానసికంగా, లైంగిక పరంగా హానిజరగటం, బెదిరింపులు, వత్తిడి, ఏకపక్షంగా స్వేచ్ఛను నిరాకరించటం, బహిరంగ లేదా వ్యక్తిగత జీవితంలో ఎలా జరిగినా దానిని లింగపరమైన హింసగా 1993 ఐక్యరాజ్య సమితి ప్రకటనలో పేర్కొన్నారు. ఇలాంటి హింస కుటుంబపరంగా లేదా భాగస్వామి, లేదా రాజ్యం పరంగా కలిగినా కూడా హింసగానే పరిగణించబడుతుంది. లైంగికపరమైన కోరికలను పని స్థలంలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వ్యక్తపరిచినా, బలవంతంగా ప్రయత్నించినా, పరోక్షంగా ప్రోత్సహించినా అది నేరమే. బీజింగ్ వేదిక (1995) దీనిని మరింత విస్తృత పరిచింది. సాయుధ ఘర్షణల సమయంలో అత్యాచారాలు ఒక పథకం ప్రకారం జరిపినా, లైంగిక దోపిడీకి గురిచేసినా, బలవంతంగా గర్భందాల్చేట్లు చేసినా, అబార్షన్ చేసినా, గర్భనిరోధక మాత్రలు తినిపించినా, అది నేరమే. అంతేకాదు మైనారిటీలు, వయస్సులో పెద్దవారు, వలస వచ్చిన వారు, నిర్వాసితులు, మారుమూల ప్రాంతాలలో దారిద్ర్య పరిస్థితులలో జీవిస్తున్న మహిళలపై ఇలాంటివి జరిగినా అది కూడా నేరంగా పరిగణించబడుతుంది. గర్భనిరోధక సాధనాలు లేదా

మాత్రలను నిరాకరించినా అది కూడా లైంగికపరమైన హింసగానే పరిగణించబడుతుందన్నది చాలా మందికి తెలియదు.

ప్లస్సా...మైనస్సా..

"అబ్బాయే కావాలి అమ్మాయి వద్దు" అనుకుంటూ గర్భంలోనే ఆడశిశువులను అంతం చేస్తున్న దుర్మార్గానికి సరిహద్దులు లేవు. అనేక రకాలుగా ఏటా ఆసియా ఖండంలో ఆరు కోట్లమంది బాలికలు అదృశ్యం అవుతున్నారు. **ఏ దేశంలో లేదా ప్రాంతంలో అయినా అమ్మాయిల కంటే అబ్బాయిలు ఎక్కువ ఉన్నారంటే అది ఆడశిశువులను హత్య చేసే ప్రాంతం అన్నట్లే. ఇలాంటి దేశాలలో మనది కూడా ఉంది.** జనాభా వివరాల ప్రకారం 1991లో వెయ్యిమంది పురుషులకు 945 మహిళలుంటే 2003 నాటికి 927కు పడిపోయింది. హర్యానా, గుజరాత్, ఢిల్లీలో తేడా మరింత ఎక్కువగా ఉంది. జీవ సంబంధమైన కారణాల రీత్యా సాధారణంగా ప్రతి వందమంది అమ్మాయిలకు 103 లేదా 107 మంది అబ్బాయిలు జన్మిస్తారు. ఎక్కడైనా అమ్మాయిలు తగ్గితే అక్కడ సమస్యలు ఏర్పడినట్లే. లైంగిక కోర్కెలు తీర్చుకొనేందుకు యువతులను బలవంతంగా వ్యభిచారంలోకి దింపటం లేదా కొన్ని సందర్భాలలో బలవంతపు వివాహాలకు కూడా అమ్మాయిలను మాయం చేస్తారు. మన దేశంలో హర్యానాలో అమ్మాయిల సంఖ్య చాలా తక్కువగా ఉన్నందున ఇలాంటి ఉదంతాలు జరుగుతున్నాయి. చైనాలో మరో ఐదేండ్ల నాటికి స్త్రీ పురుష నిష్పత్తిని సాధారణ స్థాయికి తీసుకురావటానికి అక్కడి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. మన దేశంలో బాలికా సంరక్షణ పథకాలు ఇలాంటి చర్యలలో భాగమే. లింగపరమైన హింస పర్యవసానాలు తీవ్రంగా ఉంటున్నాయి. గర్భం దాల్చిన సమయంలో ప్రతి నలుగురిలో ఒకరు ఏదో ఒకరకమైన హింసకు గురౌతున్నారు. ఇది తల్లీబిడ్డలకు ప్రమాదం. మనదేశంలో పదహారు శాతం పురుటి మరణాలు హింస పర్యవసానమే అని అంచనా వేస్తున్నారు. గర్భవిచ్ఛిత్తి, తక్కువ బరువుతో పుట్టే పిల్లల గురించి చెప్పనవసరం లేదు. వాటికి ప్రధాన కారణం హింసే. అమెరికా, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, కెనడా, ఇజ్రాయెల్ వంటి కొన్ని దేశాలలో హత్యకు గురౌతున్న మహిళల్లో 40 నుండి 70 శాతం మంది భాగస్వాముల చేతుల్లోనే మరణిస్తున్నారు.

మానవ జాతి చరిత్రలో బానిసల వ్యాపారం గురించి అందరం చదివాము. అది గతించిన చరిత్ర కానందుకు సిగ్గుపడాలి. అమ్మాయిలను బలవంతంగా లైంగిక వ్యాపారానికి తరలించటం అతి పెద్ద బానిస వ్యాపారంగా ఇప్పుడు తయారైంది. వేగంగా పెరుగుతున్న అక్రమ వ్యాపారాలలో మత్తుమందులను మించి పోతోంది. దాదాపు అన్ని దేశాలలో ఏదో ఒక రకమైన చట్టాలు లైంగికపరమైన హింసను నిషేధిస్తున్నా నానాటికీ పెరగటం పాలకవర్గాల చిత్తశుద్ధి లేమికి, మహిళలను కూడా వ్యాపార సరుకుగా చూసే వైఖరికి నిదర్శనం.

హింసలేని స్వేచ్ఛా జీవితం మా హక్కు

ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో పని చేసే ఎనిమిది సంస్థలు "హింసలేని స్వేచ్ఛా జీవితం మా హక్కు" అంటూ మహిళల తరఫున 1998లో ప్రారంభించిన ప్రచారంతో లాటిన్ అమెరికా, కరేబియన్ ప్రాంతంలోని 22 దేశాలు ఏకీభవించాయి. విధాన నిర్ణేతలు, జనం ముందు కూడా ఈ ఎజండానుంచాయి. మహిళలకు వ్యతిరేకంగా జరిగే హింస కారణంగా తలెత్తే ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనేందుకు 30 దేశాలు వ్యూహాలను గుర్తించాయి. మహిళలపై హింసను నివారించటానికి పురుషులు కూడా ముందుకు రాకుండా అరికట్టటం అసాధ్యం. అందుకే జనాభా-అభివృద్ధిపై 1994లో జరిగిన అంతర్జాతీయ సభ దానిని గుర్తించింది. పునరుత్పత్తి ఆరోగ్య సమస్యలు, కుటుంబ జీవనంలో బాధ్యతలను పంచుకోవాల్సిన ఆవశ్యకతను పురుషుల తెలుసుకొని అందుకు పూనుకోవాలని పిలుపు నిచ్చింది. ఇది మిలీనియం అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవటానికి ప్రత్యక్షంగా పరోక్షంగా తోడ్పడుతుందని గుర్తించింది. ఎయిడ్స్ వ్యాధికి నివారణ తప్ప ఇంతవరకు చికిత్స లేనందున పురుషుల ప్రవర్తనలో మార్పు నివారణకు ఎంతగానో తోడ్పడుతుంది. కుటుంబ నియంత్రణ, కుటుంబ అవసరాల కోసం భార్యలు పని చేయాలా లేదా అనే అంశాలను ప్రధానంగా నిర్ణయిస్తున్నది పురుషులే. గర్భం దాల్చినపుడు, పిల్లలు పుట్టినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కొన్ని సందర్భాలలో తలెత్తే ఆరోగ్య సమస్యలు, తక్షణమే వైద్యం చేయించితే కలిగే ప్రయోజనాలు పురుషులకు తెలియ చెప్పినట్లయితే ఎంతో ఉపయోగం ఉంటుంది. కుటుంబం పట్ల బాధ్యత విస్మరించిన తండ్రులున్న కుటుంబాల పిల్లలు ఎక్కువ మంది దారిద్ర్యంతో బతుకుతున్నారు. అనేక అవాంఛనీయ పరిణామాలు, పర్యవసానాలకు గురౌతున్నారు. తండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం గడుపుతూ సన్నిహితంగా ఉంటే మగపిల్లల్లో నేర స్వభావం తగ్గుతుందని కొన్ని సర్వేలలో తేలింది. పిల్లల్లో లింగపరమైన సమానత్వాన్ని పెంపొందించటంలో కూడా తండ్రి పాత్ర ఎంతో ఉంటుందని తేలింది. ఈ విధంగా అనేక అంశాలు పురుషులతో ముడివడి ఉన్నాయి.

గొంతు విప్పి గర్జించండి!

పదహారు రోజుల మేలుకొలుపు కార్యక్రమాలు ప్రపంచమంతటా ఒకే విధంగా ఉండవు. ఆయా దేశాలలో ముందుకు వచ్చిన సమస్యలను ప్రధానంగా కేంద్రీకరించుకోవచ్చు. నవంబరు 25 మహిళలపై హింస వ్యతిరేక దినం. డిసెంబరు 10 అంతర్జాతీయ మానవహక్కుల దినం. మధ్యలో డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ డే కూడా వస్తుంది. కనుక ఈ పదహారు రోజులలో మహిళల సమస్యలపై ఎలుగెత్తి అంతర్జాతీయ సంస్థల, ఆయా దేశాల ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చేందుకు మహిళలను సమీకరిస్తారు. టీవీ ఛానల్స్‌లో ఇంటర్వ్యూలు, పత్రికా ప్రకటనలు ఇవ్వటం దగ్గర నుండి సంపాదక లేఖలు రాయటం వరకు అన్ని అవకాశాలను వినియోగించుకొని ఎక్కడిక్కడ సమస్యలను వెలుగులోకి తేవాలని నిర్వాహకులు సలహా ఇచ్చారు. పదహారు రోజులకు పదహారు కార్యక్రమాలను రూపొందించుకొని సాధ్యమైన మేరకు మహిళలను సమీకరించి తమ గళం విప్పాలని కోరారు.

ఈ వ్యాసంలో, కవర్‌పేజీలో ఉపయోగించిన చిత్రాలు మోహన్ గీసినవి.

ఆరోగ్యం

విటమిన్ల కథ

డాక్టర్ నాగినేని భాస్కరరావు

పైరిడాక్సిన్

నీటిలో కరిగే విటమిన్ బి6 ను పైరిడాక్సిన్ అంటారు. ఇది పైరిడాక్సిన్, పైరిడాక్సాల్, పైరిడాక్సమిన్ అనే మూడు ప్రకృతి సిద్ధమైన పైరిడిన్‌లను కలిగి ఉంటుంది. పైరిడాక్సిన్ వృక్ష సంబంధ ఆహారంలోనూ, పైరిడాక్సాల్, పైరిడాక్సిన్‌లు జంతు సంబంధ ఆహారంలోనూ ఉంటాయి.

డికార్బాక్సిలేజ్, డిఎమైనేజెస్, ట్రాన్స్‌ఎమైనేజెస్, అనేక ఎంజైములకు పైరిడాక్సిన్ సహ ఎంజైముగా పని చేస్తుంది. ట్రిప్టోఫాన్‌ను నికోటినిక్ ఆమ్లముగా మార్చడానికి పైరిడాక్సిన్ అవసరం. అందువల్ల పైరిడాక్సిన్ లేనప్పుడు ట్రిప్టోఫాన్ మాధ్యమిక ఉత్పత్తులు, ఇతరములు మూత్రంలో విసర్జించబడతాయి. వీటిలో గ్జాంతురెనిక్ ఆమ్లం ముఖ్యమైనది.

పెద్దలకు రోజుకు రెండు నుంచి మూడు మిల్లీగ్రాములు, పిల్లలకు 0.2 నుంచి 0.3 మి.గ్రా. పైరిడాక్సిన్ అవసరం. అధిక మాంసకృత్తులతో కూడిన ఆహారం తీసుకున్నప్పుడు పైరిడాక్సిన్ అవసరం ఎక్కువవుతుంది. పైరిడాక్సిన్ వల్ల చాలా ఉపయోగాలున్నాయి. ఐఎన్‌హెచ్, సైక్లోసిరీన్, డి-పెన్సిలినమైన్, హైడ్రాల్‌జిన్, నోటి ద్వారా తీసుకొనే గర్భ నిరోధక మాత్రలతో పాటు పైరిడాక్సిన్‌ను ఇవ్వాలి. సారాయి తాగే వారికి పైరిడాక్సిన్ చాలా అవసరం. గర్భిణీ స్త్రీలకు వచ్చే వాంతుల నివారణకు పైరిడాక్సిన్ ఇస్తారు. రేడియేషన్ సిక్‌నెస్‌లో, ప్రయాణంలో వచ్చే అలసటలో, సిడిరోబ్లాస్టిక్ రక్తహీనతలో, ఎగ్రాన్యులో సైటోసిస్, హీమోసిస్టినూరియా. హైపర్ ఆగ్జాలూరియా, చిన్న పిల్లల్లో వచ్చే మూర్ఛలకు, పాలు పడకుండా ఉండటానికి, మూత్ర పిండాల్లో రాళ్ళకు, సిబోరిక్ చర్మ వ్యాధిలో పుండ్లపై రాసుకోవడానికి పైరిడాక్సిన్‌ను ఉపయోగిస్తారు. మొదటి రకం ఆగ్జాలూరియా నోటి ద్వారా



ఇచ్చే పైరిడాక్సిన్‌కు నయమవుతుంది.

పైరిడాక్సిన్ లోపం అరుదుగా వస్తుంది. ఆహారంలో తక్కువగా తీసుకోవడం వల్ల, ఐఎన్‌హెచ్ మందు ఇవ్వడం వల్ల, జ్వరంలో, గర్భిణీ స్త్రీలలో, సరిగ్గా శోషింపబడకపోవడం, ఫాస్ఫోరిలేషన్ సరిగ్గా జరగకపోవడం వల్ల, అవసరం ఎక్కువ కావడం వంటి కారణాల వల్ల సెకండరీ పైరిడాక్సిన్ లోపం రావచ్చు.

ఇది లోపిస్తే చిక్కిపోవడం, చర్మంపై పొట్టు రాలడం, ముక్కు పెదాల వద్ద చర్మ వ్యాధి, నోటి కోణాల వద్ద, అరుదుగా ఎర్రని నాలుక, కొన్ని రకాల రక్తహీనతల వంటి లక్షణాలు ఉంటాయి. చికాకు, మానసిక దిగులు, మూర్ఛలు వస్తాయి. నరాల బలహీనత రావచ్చు. ట్రిప్టోఫాన్ లోడు పరీక్ష ద్వారా పైరిడాక్సిన్ లోపాన్ని నిర్ధారించవచ్చు.

పెద్దలకు రోజుకు 50 నుంచి వంద మి.గ్రా. పైరిడాక్సిన్ ఇవ్వడం



ద్వారా ఈ లోపాన్ని నివారించవచ్చు. ఇతర కారణాలకు కూడా చికిత్స ఇవ్వాలి. గుడ్డు పచ్చసొన, పాలు, చేప, క్యాబేజీ, పూర్తి ధాన్యాలలో విటమిన్ బి6 సమృద్ధిగా లభిస్తుంది. ప్రేవుల్లోని బ్యాక్టీరియా ఈ విటమిన్‌ను తయారు చేయగలదు.

కథ

బింగి సత్యనారాయణ

ఎండమావులు

"అటెండరు గాణ్ని... అంత. డబ్బు తేగలనా...సుజాత మెళ్లో మంగళసూత్రాలనమ్మయినా నాన్నను బతికించుకోవాలి... మరి తనొప్పుకుంటుందో... లేదో..."

ఈ ఆలోచనలన్నింటికీ కారణం... నాన్నగారి హార్ట్‌లోని రెండు వాల్స్ బ్లాకయిపోయాయనీ, ఎంత త్వరగా సర్జరీ చేస్తే అంత మంచిదనీ, లేకుంటే తామేం చేయలేమనీ డాక్టర్లు తేల్చిచెప్పేశారట. దాదాపు లక్షకు పైగా ఖర్చవుతుందట. అదీ వారు ఈ మధ్య ఆఫర్స్ ప్రకటించారు

కాబట్టి! విషయం తెలిసి నలుగురు కొడుకులం ఉన్న పళంగా నాన్నగారిని చేరుకున్నాం. మమ్మల్ని చూడగానే అమ్మానాన్నలకు కొండంత ధైర్యమొచ్చింది. ముఖ్యంగా నాన్నగారికి. 'నాకేం కాదు! ఏమన్నా అయినా...నలుగురు కొడుకులున్నారు. వారు చూసుకుంటారు' అనే ధీమా ఆయన చూపులో దృఢంగా ఉంది. నాన్నగారిని చూశాక అందరం బైటికొచ్చాం. ఒకరికన్నా ముందు మరొకరు తమ పరిస్థితులనేకరువు పెట్టారు. ఒకరికి స్కూల్సు ఓపెనింగ్సనీ, మరొకరు అమ్మాయి పెళ్లి పెట్టుకున్నామనీ, ఇంకొకరు ఈ మధ్యనే లక్షలు పోసి ప్లాటు కొన్నాననీ...ఇలా తమ బాధలను చిలవలుపలువలు చేసి చెప్పారు. నిజం చెప్పాలంటే నాకన్నా మంచి పొజిషన్‌లో వారున్నారు. ఉన్నతస్థాయి ఉద్యోగంలో ఉండి మంచి జీతం తీసుకుంటున్నారు. వారు తలుచుకుంటే అప్పటికప్పుడు డబ్బు సమకూర్చగలరు. ఎట్టకేలకు నాన్నగారికయ్యే ఖర్చును సమపాళ్లలో వచ్చేట్లు చేశారు. నా స్థితిగతులను వారికి చెప్పాలనుకున్నాను. చెప్పినా మరోవిధంగా అనుకుంటారే తప్ప వాస్తవాన్ని గ్రహించరు. అందుకే మానుకున్నాను. ఇక అక్కడి నుండి బయల్దేరి వస్తోంటే... అమ్మ కళ్లలో ఓ మెరుపు... ముఖ్యంగా అమ్మ నన్ను హత్తుకుని ఏడుస్తోంటే మా అనుబంధాన్ని విడదీయొద్దు" అనే ఓ అభ్యర్థన... తన కళ్లల్లో తొణికిసలాడింది. నిజం చెప్పాలంటే నలభై ఐదేళ్ల అన్యోన్య దాంపత్యం వారిది. ఆ సంసార జీవనంలో మాకెన్నో తీపి అనుభూతులను చూపిన అమృతమూర్తులు వారు. మమ్మల్ని కళ్లల్లో పెట్టుకుని చూసుకున్న త్యాగజీవులు...అని చెప్పడం అతిశయోక్తి కాదు. నాన్నగారు...! మేం స్కూలుకెళ్లే రోజుల్లో ప్రతిరోజూ ఉదయాన్నే వేడి వేడి చపాతీలు స్వయంగా చేసిచ్చే వారు. (అమ్మ ఇంటిపనిలో ఉంటుంది కదా!) ఆ మెత్తదనం...రుచి ఆప్యాయతల కలబోతకు కామోసు! ఆ మాధుర్యమింతవరకు చూడలేదని కచ్చితంగా చెప్పగలను. ఏదైనా కావాలని గానీ తినాలని గానీ మాటవరసకు అనుకుంటే చాలు అదీ సాయంత్రానికల్లా లేదా ఆ మరునాడో ఇంట్లోకొచ్చి చేరేది. అలా గుంభనంగా ఉంటూ మా మనస్సులో ఉన్నది గ్రహించి తెచ్చేవిషయంలో ఆయనకు ఆయనే సాటి ఆయనెంతో సున్నితమనస్కులు. విశాలహృదయులు ...అలాంటి హృదయానికి ఈ రోజిలా....అమ్మ మొహాన్ని సూటిగా చూశాను. కళకళలాడే మోముకు మరింత అందాన్ని తెచ్చిన ఎర్రటి కుంకుమ వెలిగిపోతుంది. భర్తపోగానే తుడిచిపారేసే అనాచారం పోనంతకాలం ఇలాంటి అమ్మల ముఖాల కుంకుమలు చెరిగిపోతుంటాయి. చెరిగిపోవద్దనుకుంటే నాన్నగారినెలాగైనా బతికించుకోవాలి. అంటే... నా వాటాగా అనుకున్న డబ్బును త్వరగా సమకూర్చుకోవాలి. అటెండర్ ఉద్యోగానికది సాధ్యమా? సాధ్యమే! కాణీ లేకున్నా సమయాన కొండంత ధైర్యాన్నిచ్చేది భార్య మెళ్లోని కాసులపేరు. అత్యవసరాలకు అలా వెళ్లి ఇలా రావడం దానికి చాలాకాలంగా అలవాటైపోయింది. కాని ఇప్పుడెళితే ఇక తిరిగిరాదు. దానికి నా భార్యని ఒప్పించాలిగా మరి! ఒప్పుకుంటుంది!! ఆస్తీఅంతస్తులు లేకపోయినా... ఎదుటి వాళ్ల మనసునర్థం చేసుకుని మసలుకోగల సుగుణం కలది. అలాంటి స్త్రీ మూర్తి నా భార్యగా వచ్చినందుకు నాకు కించిత్ గర్వంగానే ఉంటుంది. ఆలోచనలతోనే రిక్షా దిగి రైల్వేస్టేషన్ వైపుగా నడిచాను. ప్రకటించిన సమయానికే రైలు రావడం... నేను ఎక్కడం... అది కదలడం ఒక్కసారిగా జరిగాయి. తన ప్రస్థానాన్ని అతివేగంగా సాగిస్తూ... మరో స్టేషనుకెళ్లి ఆగింది. ఉన్న ఐదు నిముషాలలో ఎక్కేవారు... దిగేవారు చకచకా తమ పనులు కానిచ్చేశారు. నేనూ దిగి ఓ వాటర్ బాటిల్ కొనుక్కుని వచ్చేసరికి నా ఎదురుగా ఉన్న బెర్తులో ఇద్దరు పిల్లలతో ఓ మధ్యవయస్కుడొచ్చి కూర్చున్నారు. రైలు తిరిగి తన పయనం మొదలెట్టింది. ఆ పిల్లలలో కలకలం మొదలైంది.

"నేను కిటికీ వైపుకూర్చుంటాను! లే! నువ్విక్కడ కూర్చో!!" అన్నాడో కుర్రాడు.

"నేనిక్కడినుంచి కదలను. నాకిక్కడే బాగుంది" అన్నాడు బయటివైపు చూస్తూ అవతలి కుర్రాడు.

"లేరా!" అంటూ చెయ్యి పట్టి లాగబోయాడు మొదటి కుర్రాడు.

"పోరా!" అంటూ చెయ్యి విదిలించాడు రెండో కుర్రాడు.

"చూడు తాతయ్యా! వీడు 'రా' అంటున్నాడు"

"అలా అనొద్దురా చందూ! నువ్వు చిన్నవాడివి కదా! అన్నయ్యను అలా అనొచ్చా! పెదవాళ్లనెప్పుడూ అలా అనొద్దు. పెద్దలనెప్పుడూ గౌరవించాలి" అన్నాడా పెద్దాయన.

"సరే తాతయ్యా!" అంటూ బుద్ధిగా తలూపాడు ఆ కుర్రాడు. వారి సంభాషణ్ని అప్పటి దాకా ఆసక్తిగా వింటున్నాను. ఇలాంటి వారు ఇంటికొకరున్నా పిల్లలు బుద్ధిమంతులుగా మారతారని అనుకున్నాను. మళ్లీ సంభాషణ మొదలైంది. అందులో ఎన్నో గొప్ప విషయాలు ... నీతి కథలు... తోటి మానవుల పట్ల చూపాల్సిన మానవత్వం గురించి... నా మనసులోని సమస్యలన్నీ పక్కన పెట్టి ఆసక్తిగా వినసాగేను. వింటూనే నిద్రలోకి జారుకున్నాను. తిరిగి అరగంటలోనే ఠక్కున లేచి కూర్చున్నాను. కారణం... ఓ పీడకల! నా భార్య ఒప్పుకోనట్లూ... నాన్నగారు చనిపోయినట్లూ... అది చూసి అమ్మ నాన్న మీద పడి బోరుమన్నట్లు... అదే నిజమైతే!! మనసులో ఏదో అలజడి...కలవరం...

"డబ్బులు సర్దగలనా! నాన్నని బతికించుకోగలనా! లేకుంటే అమ్మ దృష్టిలో నేను ఏ స్థానంలో ఉంటాను. కొడుకుగా నైతిక బాధ్యతను విస్మరించిన వాడినౌతానా!" ఎన్నో ఆలోచనలు... బుర్రని వేడెక్కిస్తున్నాయి.

ఇలా నా విషయంలో జరగకూడదు. తమ పిల్లల మీద ఆధారపడి ఉన్న తల్లిదండ్రులకు వారు 'ఎండమావుల్లా' అనిపించకూడదు. సేదతీర్చి అక్కునచేర్చే వానప్రస్థాల్లా అనిపించాలి' అని దృఢంగా అనుకున్నాను. నేను దిగాల్సిన స్టేషను రాగానే... దిగి చకచకా ఇంటివేపు పయనం సాగించాను. నా కోసం ఎదురుచూస్తూ... నా భార్య నేను ఇంట్లోకి రాకముందే...

"మావయ్య గారికెలా ఉందండీ... నేనూ వద్దామంటే మీ దగ్గర డబ్బుల్లేవు..." అని ఆరుర్దాగా అడిగింది. ఆ పలకరింపుకే బెంగ సగం తీరినట్లయింది. నాన్నగారి పరిస్థితి...రైల్లో వచ్చిన పీడకల గురించి చెప్పగానే...

"భలేవారండీ మీరు... నేనలా ఎందుకంటానని ఊహించారు?" అంది.

"అమ్మకు జబ్బుచేస్తే... మా అన్నయ్యలు, వదినలు సరిగా పట్టించుకోలేదు. అప్పుడు మీరు వాళ్లకు చెప్పిన విషయాలు నేనూ విన్నానండీ..." అందినదమంత్రపు సిరి లక్ష్మిల్లా రూపెత్తిన మా వదినెలకు, పేదరికం చవిచూసిన నా భార్యకు మధ్య గల తేడాను కళ్లారా చూశాను. తాతయ్య గురించేం చెబుతానా అని ఎదురుచూసే నా పిల్లల హృదయాలు ఎండమావులు కాదు... పండు వెన్నెలలే అనుకున్నాను.

ప్రైవేట్ ఇంటర్వ్యూ

గ్యాస్ లీకోపాఖ్యానం

వి.వి.

రఘు కళ్లు నులుముకుంటూ పడక మంచమ్మీదనుంచి లేచాడు. ఇంటి గుమ్మంలో ఉన్న వార్తా పత్రికలు పుచ్చుకుని వరండాలోని సోఫాలో చతికిలబడ్డాడు. వంటింటి వైపు చూస్తు "లక్ష్మి, టీ" అని కర్ణ కఠోరంగా అరిచాడు. ఆ అరుపుకు వంటింట్లోని లక్ష్మి ఉలిక్కిపడింది. "అయ్యో నా మతి మండ, ఆయనింకా లేవలేదని ఇవ్వాళ టీ సంగతే మరచిపోయానే" అని కంగారు పడుతూ టీ గిన్నె స్టవ్ మీదపడేసి చక్కెర, టీ పొడి వేసింది. గ్యాస్ తిప్పి లైటర్‌తో వెలిగించబోతే అదెంతకూ వెలిగి చావలేదు. ఇక లాభం లేదని అగ్గిపెట్టె కోసం వెతికింది. కనిపించలేదు. భర్త దగ్గరుందని తెలిసీ ఆయన్నడిగే సాహసం చేయలేక పక్కింటి పిన్ని గారింటికి దౌడుతీసింది. ఆ హడావిడిలో ఓపెన్ చేసిన గ్యాస్‌ను కట్టేయడం మరిచిపోయింది. అప్పటికే నోట్లో సిగిరెట్, చేతిలో అగ్గిపెట్టె పట్టుకుని ఎదురుచూస్తున్న రఘు "లక్ష్మి...లక్ష్మి" అంటూ రంకెలేస్తూ వంటింట్లో శివతాండవాన్ని మరిపించేలా పతితాండవం ప్రారంభించాడు. పొయ్యిమీద టీ గిన్నె ఉండటాన్ని చూసి అగ్గిపుల్ల వెలిగించాడు. అంతే...ఢాం...ఢాం.. సిలెండర్ పేలిన శబ్దం. రఘు ఏమయ్యాడో కనిపించనంతగా...

ఈ కలతో గాఢ నిద్రలో ఉన్న విక్రమార్కుడు మంచం మీద నుంచి ఉలిక్కిపడి కిందపడ్డాడు. కళ్ళు తెరిచి చూసేటప్పటికి గదంతా నిశ్శబ్దంగా ఉంది. గ్యాస్ పేలుళ్ళు లేవు... మంటల్లో రఘూ... పూర్తిగా తెలివిలోకొచ్చిన విక్రమార్కునికి ఆశ్చర్యమేసింది. 'భూత, ప్రేత, పిశాచ గణ హింసనూ, వాటి నణచి ఉంచే యుద్ధ తంత్రాలనూ కలగా కంటిని... రాజాధముల మొదలు వీరాధి వీరులనూ, శూరాధి శూరులనూ ఎదిరించి ఓడించిన కలయనూ గంటిని... మదీయ మస్తిష్కాన ఏమీ గ్యాస్ పేలుళ్ళు' మనసులో ఆలోచనలు బుర్రను తొలుస్తుండగానే 'ఒహో! ప్రజాస్వామిక పాలకుడైన పౌర సరఫరాల మంత్రి రఘువీరారెడ్డి గ్యాస్‌పై సంధించిన చర్చల 'లీకోపాఖ్యానం' ప్రతిబింబమే ఈ కలన్న మాట. గ్యాస్ లీకై ఆ మంటల్లో నా కలలోకొచ్చిన రఘు చిక్కుకుంటే... రఘువీరా రెడ్డి గ్యాస్ సరఫరా కోతపై నాలుగ్గోడల మధ్య చేసిన యోచన లీకై తెలుగుదేశాన ప్రకంపనలు సృష్టించిన ఉపాఖ్యానం.. వెరసి గ్యాస్ లీకోపాఖ్యానమైంది. ఈ అంశాన్నే ఈ వారపు ప్రశ్నగా వేయించి భేతాళుణ్ని జయిస్తాను.' ఆలోచన తట్టిందే తడవుగా భేతాళుణ్ని భూజానికెత్తుకుని గ్యాస్ చర్చలోకి దించి, దాన్ని ఈ వారపు భేతాళ ప్రశ్నగా మార్పించాడు. 'గ్యాస్ చర్చలు లీకు కావడం వల్లనే మంటలు రేగాయి భేతాళా' అని విక్రమార్కుడు విజయం తనదే అన్న ధీమాతో మురిసిపోతూ ముసిముసి నవ్వులతో సమాధానం చెప్పాడు. "కాదు మహారాజా! గ్యాసు లీకులో మీరూ కాలేశారు. రఘువీరారెడ్డిని కలిసి ఇంటర్వ్యూ ద్వారానే అసలు విషయం చెప్పిస్తాను. పద." అనగానే భేతాళుడు విలేకరిగా, విక్రమార్కుడు కెమెరామెన్‌గా మారి మంత్రి రఘువీరారెడ్డ ముందు ప్రత్యక్షమయ్యారు. గత పరిచయంతో నేరుగా ఇంటర్వ్యూ మొదలు పెట్టారు.



బి.తాళ్ : సార్, తెలుగు నాట ఈ గ్యాస్ మంటలెందుకు చెలరేగాయంటారు?

మంత్రి : (తొలి ప్రశ్నకే మంత్రికి కడుపు మంటరేగింది) మా ప్రత్యర్థుల కమ్ముడుపోయిన ఒక పత్రిక తప్పుడు రాతల వల్ల...కనికట్టు కథనాల వల్ల.. (మనసులో కసిని మాటల్లో కక్కారు)

బి.తాళ్ : అయితే మీరు చర్చ జరిపింది అబద్ధమంటారా?

మంత్రి : నిజమేనండి. చర్చించాం. ఎక్కడ. మా ఆఫీసులో... సవాలక్ష చర్చిస్తాం...పడకటింటి కబుర్ల మొదలు పండంటి కాపురం వరకూ... సవాలక్ష చర్చిస్తాం. అంత మాత్రాన అవన్నీ ప్రభుత్వ నిర్ణయాలౌతాయా?

బి.తాళ్ : అంటే రాష్ట్రంలో... గ్యాస్ సమస్య లేదంటారా?

మంత్రి: ఉండబట్టే కదండీ ... దానిపై చర్చలు జరుపుతూ మీడియా వాళ్ళ నోళ్ళలో నానింది.

బి.తాళ్ : అంటే మీడియాదే తప్పు తప్ప... మీ చర్చల్లోని అంశాలపై బ్రేకుల్లేని లీకులు చేసి (ప్రజల స్పందనను పసిగట్టేందుకు)... పాత్రికేయులపై సాకులు చెబితే ప్రజలు నమ్ముతారా సార్?

మంత్రి: నమ్మరు. అందుకే కదా! నిర్ణయం కాని దాన్ని నిజంగా ప్రచారం చేసినోళ్ళపైనే మేం విరుచుకుపడుతున్నాం.

బి.తాళ్ : అయినా... చర్చ నిజమే అయినప్పుడు అడుసుతొక్కి కాలు కడుగుతూ కూడా... బోడిగుండుకు మోకాటి చిప్పకూ లంకెపెట్టి వాదించడం.

మంత్రి: తప్పదండి... పాలనలో ఉంటే ఇంతే... ఎన్నికలప్పుడు తప్ప రాజకీయాలు మాట్లాడొద్దన్న చంద్రబాబు ఇప్పుడు రోజూ రాజకీయాలే మాట్లాడ్డం లేదా? ప్రపంచ బ్యాంకు జీతగాడుగా ముద్రపడ్డ ఆయన ఇప్పుడు అవే మాటలు మమ్ములనడం లేదా?

బి.తాళ్ : అంటే... వారూ మీరూ...

మంత్రి: ఇందులో ఒకటే. పాలనలో ఉంటే ఒక రకం... ప్రతిపక్షంలో ఉంటే మరో రకం.

బి.తాళ్ : అసలింతకూ గ్యాస్ సమస్య, సమస్యలో గ్యాసే సార్?

మంత్రి: మా శ్రేయోభిలాషివి... నీతో దోబూచులెందుకు? సబ్సిడీలెత్తి గ్యాస్ ధరలపై నియంత్రణ తొలగిస్తే దండిగా లాభాలు దండుకోవచ్చన్నది గ్యాస్ కంపెనీల ఎత్తు. అంతర్జాతీయ చమురు సంస్థలు ఈ మేరకు ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ సంస్థలిచ్చే అప్పుల షరతుల్లో భాగం చేయించాయి. అవి మనకూ మనదేశంలో సిలిండర్‌పై రూ. 105 నుంచి 110 వరకు సబ్సిడీ ఉంది. దీన్నెత్తేయండీ లేదా సబ్సిడీని భరించండని గ్యాస్ కంపెనీలు వాదిస్తున్నాయి. మన కేంద్రం... (మరువకండి గత వాజ్‌పేయి ప్రభుత్వంతో సహా...) సబ్సిడీ ఎత్తేయ డానికి తటపటాయిస్తోంది. మళ్ళీ ఏ ప్రజోద్యమ కెరటమో తమ ప్రభుత్వాన్నీ..... అని భయపడుతోంది. ఇటు ప్రభుత్వం సబ్సిడీ పెంచక, అటు ధరల పెంపుకు అనుమతించక పోవడంతో ఒళ్ళు మండిన కంపెనీలు కృత్రిమ కొరతను సృష్టించి... సత్వర నిర్ణయం తీసుకోని ప్రభుత్వాన్ని... గ్యాస్ మంటల్లో వేపుతున్నాయి. కేంద్రంలో మేమే.... రాష్ట్రంలో మేమే కనుక... అక్కడ నిర్ణయం వెలువడేలోపు... ఆ సెగ మాకంటకుండా చూసుకునేందుకు దొడ్డితోవలు వెతుకుతున్నాం. ఎలాగూ అందరికీ కార్డులిచ్చాం కనుక కార్డుకూ సిలెండరుకూ లింక్ పెట్టాం. ఇందులో తప్పేంటంట. (తన తర్కానికి తానే మురిసిపోయాడు.)

బి.తాళ్ : న్యాయబద్ధంగా ఉంటే బాగానే ఉంటుంది సార్. మీ కలెక్టరొకరు (రంగారెడ్డిజిల్లా) రెండు సిలెండర్లుంటే తెల్ల కార్డులివ్వమన్నారు. తెల్లకార్డులేకుండా సబ్సిడీ గ్యాస్ ఇవ్వకూడదని ఇప్పుడు చర్చిస్తున్నారు... వీటి అంతరార్థం...

మంత్రి: లలలాం.... లలలాం.. (ఉన్నట్టుండి ఆలాపన మొదలుపెట్టారు. దీంతో బేతాళూ బిత్తర పోయాడు.) అదే మరి రాజకీయం. నోటితో చెప్పకుండా నొసటితో వ్యక్తీకరించడమే నేటి రాజకీయమండి.

బి.తాళ్ : ధన్యవాదాలు సార్. చక్కటి వివరాలు అందించారు. (అంటూనే ఇద్దరూ అసలు రూపాల్లోకి మారారు)

"ఇప్పుడేమంటావు రాజా? ఇప్పటి గ్యాస్ మంటలు లీకోపాఖ్యానమేనంటావా? ప్రపంచ బ్యాంకు కనుసైగలతో... వాళ్ళ అప్పుకోసం... మన పాలకులు సృష్టించిన మాయాబజార్ ఫలితమే నేటి గ్యాస్ రచ్చంటావా? ప్రజలకిచ్చే రూ. 110 సబ్సిడీని తొలగించి ఆ భారం వారిపై వేస్తే ఇప్పుడు చర్చలో ఉన్న మాయాబజార్ అదృశ్యమౌతుంది" అనగానే విక్రమార్కుడు ఓటమిని అంగీకరిస్తూ మౌనం దాల్చాడు. భేతాళుడు తుర్రున జమ్మిచెట్టుపైకి పారిపోయాడు.

మనమూ - మన నమ్మకాలు

డా॥ దేవరాజు మహారాజు

మనిషికి నమ్మకాలు ఉండడం ఎంత అవసరమో, మూఢనమ్మకాలు ఉండడం అంత అనవసరం. నమ్మకానికి ఒక ప్రాతిపదిక, ఒక బేస్ ఉన్నప్పుడు అది ప్రామాణిక మౌతుంది. ఏ ఆధారమూ లేని నమ్మకాలే మూఢనమ్మకాల కిందికి వస్తాయి.

"వీసా గాడ్"



ఎవరో చెట్టు కొట్టేశారు. కలప తీసుకుపోయి వాడుకున్నారు. చెట్టు మొదలు వదిలేశారు. అది ఒకప్పుడు మహావృక్షం. అందువల్ల దాని మొదలు గుండ్రంగా పెద్దగా ఉంది. బండ్లమీద పోయేవారు, పశువులు కాసుకునే వారు దాన్ని చూస్తూనే ఉన్నారు. ఒక్కోసారి పిల్లలు దాని మీదికెక్కి కూర్చొనే వారు. ఆడుకునే వారు. కబుర్లు చెప్పుకునేవారు. కార్లలో జీబుల్లో వేళ్లేవారు దాన్ని చూసి ఎంత పెద్ద చెట్టో పాపం! కొట్టేశారు అని జాలి పడేవారు. కాలం మారింది. వర్షాలు కురిశాయి. చెట్టుమొదలులో ఉన్న గుంట నిండా నీరు నిలిచింది. భూమి మెత్తబడింది. దారినపోయే కొందరు కుర్రాళ్ళు ఆ మొదల్ని లేపి సరిగా నిలబెట్టారు. ఏమో... అంటుకుని నాటుకుంటే మళ్ళీ చెట్టు చిగురిస్తుంది కదా అని ఆశ!! ఎడతెరపి లేని వర్షాలకు భూమంతా ఆకుపచ్చ చొక్కా వేసుకుంది. కొత్తగా గడ్డి మొలిచింది. చెట్లన్నీ ఊపిరి పీల్చుకున్నట్టు, తలలు విరబోసుకున్నట్టు, కొత్త జవసత్వాలతో నిలబడ్డాయి. ఆ క్రమంలోనే కుర్రవాళ్ళు నిలబెట్టిపోయిన చెట్టు మొదలుకు (మొద్దుకు) చిన్నగా వేళ్ళు పుట్టాయి. అవి నాటుకున్నాయి. చచ్చిపోయిందనుకున్న మొద్దు బతికింది. పిలకలు పిలకలుగా పచ్చని మొలకలు పైకి లేచాయి. ఇప్పుడు దానికొక ఆకారం వచ్చింది. దూరం నుండి చూస్తే ఆ చెట్టు ఇప్పుడు మేక తలకాయలాగా అనిపిస్తోంది.

ముడుపు కడితేనట...!

చెట్టు మొదలు బతకడం, పైగా "మేక తల ఆకారం" సంతరించుకోవడం కొందరికి ఆశ్చర్యంగా తోచింది. అందులో ఏదో 'దైవాంశ' ఉందని అనిపించింది. దైవభక్తి గల వారికి అన్నింటిలో దైవం కనిపిస్తాడు. సహజమే కదా ? వారు ఆ చెట్టుకు పూజలు చేశారు. కుంకుమ, పసుపు చల్లారు. కొబ్బరికాయలు కొట్టారు. ఒకతను కొబ్బరి బోండాం గుడ్డలో కట్టి ఆ చెట్టుకు వేలాడదీశాడు. అతను ఎప్పటినుండో విదేశాలకు వెళ్ళాలని ప్రయత్నిస్తున్నాడు. కానీ వీసా దొరకడం లేదు. వీసాకోసం వెళ్ళే వారికి ఈ విషయం అనుభవంలో ఉండేదే. అక్కడ అధికారులకు కొన్ని మార్గదర్శక సూత్రాలుంటాయి. దాన్ని బట్టి వాళ్ళు కొందరికి వీసా ఇస్తుంటారు. కొందరికి ఇవ్వరు. వెళ్ళగా వెళ్ళగా ఎప్పుడో ఓసారి ఏదో కారణం వల్ల, లేదా అక్కడ అప్పుడు ఉన్న అధికారుల మానసిక స్థితి-మూడ్-ని బట్టి కూడా వీసా రావొచ్చు.

మేకతల ఆకారంలో వున్న ఆ చెట్టుకు కొబ్బరి బొండాం ముడుపు కట్టిన ఆ ఆసామికి అనుకోకుండా వీసా వచ్చింది. యాదృచ్ఛితంగా ఆ చెట్టుకు పూజలు చేసిన మరి కొందరు దుబాయ్ వెళ్ళిపోయారు. ఆ విషయం ఆనోట ఆనోటా జనంలో చర్చనీయాంశమైంది. ఇంకేం అక్కడ పూజలు చేసి, కొబ్బరిబోండాం గుడ్డలో కట్టి, ముడుపు కట్టిన వారికి వీసా వస్తుందా... అనే దానికి ఏ ఆధారాలు లేవు. అది కేవలం ప్రజల నమ్మకం. అంతే!!

అక్కడక్కడా పూజలు జరపనివారికి, ముడుపులు కట్టని వారికి కూడా వీసాలు వస్తున్నాయి. వేల సంఖ్యలో జనం విదేశాలకు వెళుతున్నారు. వస్తున్నారు. అదివేరే విషయం.

ఎక్కువ సంఖ్యలో జనం అక్కడికి వచ్చి పోతూ ఉండడం వల్ల ఆ చుట్టుపక్కల ఒక జాతర వాతావరణం నెలకొంది. దుకాణాలు వెలిశాయి. ఇంటి కిరాయిలు పెరిగాయి. రోడ్డు బాగైంది. కొంత మందికి జీవనోపాధి దొరికింది. నిజమే కావచ్చు. కాని ఏ ఆధారమూ లేకుండా ఒక నమ్మకం బలపడింది. ఇది మూఢనమ్మకం అంటే అందరూ ఒప్పుకుంటారు. అయితే కావొచ్చు. పూజచేసి ముడుపు కడితే నష్టం లేదుకదా! ఏదో మనసు కుదుటపడుతుంది" అని కొందరు వాదిస్తారు. కొందరు తమ స్వప్రయోజనాల కోసం దాన్నొక యాత్రాస్థలంగా మార్చుకున్నారేమో? ఆలోచించనక్కరలేదా? ఆలోచించండి!!

నిజామాబాదులో, మేకతల ఆకారంలో ఒక చెట్టుంది. దానికి కొబ్బరిబోండాం ముడుపు కట్టడం ఒక ఆనవాయితీ అయ్యింది. అలా చేస్తే వీసా వస్తుందని ప్రచారం జరుగుతోంది.

మనిషికి నమ్మకాలు ఉండడం ఎంత అవసరమో, మూఢనమ్మకాలు ఉండడం అంత అనవసరం. నమ్మకానికి ఒక ప్రాతిపదిక, ఒక బేస్ ఉన్నప్పుడు అది ప్రామాణిక మౌతుంది. ఏ ఆధారమూ లేని ఇలాంటి నమ్మకాలే మూఢనమ్మకాల కిందికి వస్తాయి. మనిషికి తనమీద తనకు నమ్మకం ఉండడం, తన తోటి వారి మీద నమ్మకం ఉండడం అవసరం ఈ సమాజం అర్థవంతంగా, సమర్థవంతంగా రూపుదిద్దుకోవాలంటే తప్పనిసరిగా కావాల్సిన ముడి సరుకు-నమ్మకమే! అందుకే కవి బైరాగి "నాక్కొంచెం నమ్మకమివ్వూ"- అనే గొప్ప కవిత రాశాడు.



ఓ ఊరి కథ

పానుగల్లు చారిత్రక ప్రసిద్ధిగల గిరిదుర్గమున్న ప్రదేశం. గ్రామానికి సమీపంలో ఈ దుర్గం ఉండటం. గుప్తనిధులకోసం తవ్వకాలు జరుపుతుండడంతో చారిత్రక కట్టడాలు, గతవైభవ తాలూకూ చిహ్నాలు కనుమరుగవుతున్నాయి.

పానుగంటి చంద్రయ్య

చారిత్రక కట్టడాలకు నిలయం పానుగల్లు ఖిల్లా

పాన్గల్లు దుర్గం మహబూబ్‌నగర్ జిల్లాలో ఉంది. ఇది మియ్యాసాబ్ అనేదొంగ నివాసస్థావరంగా ఉండేదని ప్రచారంలో నేటికీ ఉంది. పాన్‌గల్ మియ్యాసాబ్ కార్యకలాపాలు ఈ దుర్గంనుండే నడిచేవని చెబుతారు. కాలక్రమంలో మియ్యాసాబ్ చనిపోయాక పానుగల్లు దుర్గం శిథిలావస్థకు చేరుకున్నది. బాలనాగమ్మ, మాయలపకీరు గాథకు పానుగల్లుతో సంబంధమున్నట్లు చెబుతుంటారు. ఇక్కడ అతిపురాతనమైన దుర్గమున్నది. క్రీ.శ.11వ శతాబ్దం వరకు పరిపాలించిన చాళుక్యులు పానుగల్లు దుర్గం నిర్మించారు. ఈ దుర్గం సముద్ర మట్టానికి 1,800 అడుగుల ఎత్తున ఉంది. ఐదు చదరపుమైళ్ల స్థలంలో గుర్రపునాడా అకృతిలో పానుగల్లు దుర్గం ఉంది. పానుగల్లు గ్రామంనుండి దుర్గంలోపలికి వెళ్లితే 20 అడుగుల ఎత్తులో ప్రాకారాలు కలిగి దుర్భేద్యంగా నిర్మించారు. పానుగల్లు ప్రచారంలోకి రావడాని ఈ నిర్మాణాలే ప్రధానం. అప్పటి పాలకులు పానుగల్లులో 60 బురుజులు, సప్త ప్రాకారాలు, కుంటలు, బావులు, పెద్దఎత్తున తవ్వారు. గుళ్లుగోపురాలు, మసీదు నిర్మించారు.

లభ్యమైన శాసనాలు: పానుగల్లులో పెద్దదుర్గం దగ్గర ఒక శాసనం ఉంది. దుర్గంలో పలురకాల శిల్పాకృతులు లభించాయి. జైన శిల్పాలు కూడా ఇక్కడ ఉన్నాయి. ఏనుగు గుర్రం, సింహం, తదితర ప్రతిమలు చెక్కి ఉన్నాయి. క్రీ.శ.1604లో ఒక భవంతిని 1786లో నైజాం వంశీయుడు నిజామలీఖాన్ కాలం ఈ దుర్గంలో నివశించారు.

దుర్గంలోపలికి ప్రవేశించేందుకు ద్వారాలున్నాయి. ఏడుదాకా ఉన్న ప్రధాన ద్వారం ముండ్లగని కట్టడం నేటికీ చెక్కుచెదరకుండా ఉంది. మిగతాద్వారాలు శిథిలావస్థకు చేరి కూలటానికి సిద్ధంగా ఉన్నాయి.

దుర్గంలో పడమటి దిశలో ఒక పుష్కరిణి ఉంది. దీనిని రామగుండంగా పిలుస్తారు. ఒకోరాతితో తవ్వించిన అతిపెద్దగుండంలో ఏ కాలంలోనైనా నీరు పుష్కలంగా ఉంటుంది. పక్కనేగల రాతిపై శ్రీరాముని , సీతమ్మ పాదాలముద్రలు, సమీపంలో శివలింగం ఆకారం చెక్కిఉంది. శ్రీరాముడు , సీతమ్మ పాదాలుగా భావించి ప్రతి ఏటా ఆషాడశుద్ధ ఏకాదశినాడు పరిసర గ్రామాలనుండి వందలాది మంది తరలివస్తారు. దుర్గంలోని రామగుండలంలో స్నానాలు చేసి సమీపంలోని రెండు రాతి గుట్టల మధ్య శ్రీరాముని, సీతమ్మ, శివలింగాలకు పూజలు చేస్తారు. రెండు రాతిగుట్టల మధ్య అమ్మవారి విగ్రహాలు ఉండగా పైన సీతగుండం ఉంది. అమ్మవారిని దర్శించుకుని సీతగుండంలోని నీటిన తీర్థంగా తీసుకెళుతుంటారు. ఈ ఖిల్లాలపై ఫిరంగులు నేటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. దుర్గంలో ఆయుధాలు తయారు చేసేకర్మాగారం, నివాసభవనాలు ఉన్నాయి. పల్లంగా ఉన్న దుర్గంలో దక్షిణవైపు కొంతదూరం పోతే శిథిలమైన భవనాలు కట్టడాలు కనిపిస్తాయి. నాలుగు శిల్పాలతో అందంగా ఉన్న దీనిని ఉంపుడుగత్తె ఊయలగా పిలుస్తారు. దీనిని మరికొంత దూరంలో రెండు సింహాల విగ్రహాలు లోపల మసీదు ఉంది. పానుగల్లు ఖిల్లాలో రెండుసార్లు యుద్ధాలు జరిగినట్లు చారిత్ర ఆధారాలు తెలుపుతున్నాయి. క్రీస్తుశకం 13వ శతాబ్దంలో నవాబు బహమని సుల్తాన్, ఖులీకుతుబ్‌షాలు విజయనగరసామ్రాజ్యాన్ని ఓడించినట్లు ప్రచారంలో ఉంది. క్రీ.శ.1417లో గోల్కొండ సంస్థానం ఫిరోజ్‌షాను విజయనగర సైన్యాలనోడించినట్లు చరిత్ర గ్రంథంలో ఉంది. పది బురురుజులపై ఫిరంగులున్నట్లు ప్రచారం ఉండగా ప్రస్తుతం రెండుఫిరంగులున్నాయి. ఈ దుర్గంలో లభ్యమైన చిన్నచిన్న ఫిరంగులను నాగర్‌కర్నూలు, గోపాల్‌పేట, బీచుపల్లి 10వ బెటాలియన్ స్టేషన్ దగ్గర ఉంచారు. క్రీ.శ.1529లో విజయనగసామ్రాజ్యం ఉండే వరకు వీరి ఆధీనంలో ఉన్న పానుగల్లు దుర్గమును కాలక్రమంలో చాలామంది ఏలారు. నేటికీ ఈ ఖిల్లాను పలువురు సందర్శిస్తుంటారు. అధికారులు స్పందించి ఈ ఖిల్లాను పర్యాటక కేంద్రంగా చేసి చారిత్రక కట్టడాలను శిల్పసంపదను కాపాడాల్సిన అవసరం ఎంతయినా ఉంది.



అవీ... ఇవీ

ఊడ్చే యంత్రం

ఓ కుర్ర సేల్స్‌మన్ ఒక పల్లెటూరుకు వెళ్లాడు. ఇండ్లు ఊడ్చే యంత్రాన్ని చూపి అమ్మకాలు చేయాలన్నది కంపెనీ ఆదేశం. బస్సుదిగగానే ఎదురుగా ఒక ఇంట్లో ఒక మహిళ ఖాళీగా కనిపించింది. ఇంకే...! మనవాడు వెళ్లాడు. వెళ్లగానే శుభ్రంగా ఉన్న వరండాలో తన సంచిలో తెచ్చిన చెత్తాచెదారాన్ని చల్లేశాడు. ఏయ్ బాబూ ఏం చేస్తున్నావ్ అని అడ్డుకోబోయే లోగానే ... "చూడండి అంటీ దీన్ని ఈ యంత్రంతో ఒక్క నిముషంలో ఎలా శుభ్రం చేయవచ్చో చూడండి" అన్నాడు. "ఏమిటి అది శుభ్రపరుస్తుందా మాఇంట్లో పని చేయదు బాబూ నాకు భయంగా ఉంది. మా ఆయన వచ్చే వేళకూడా అయింది. దీన్ని చూశాడంటే నాపని గోవిందా" అందా ఇల్లాలు. "మీరు భయపడనక్కరలేదాంటీ" ఇది పని చేయకపోతే మీకు దీనిని ఫ్రీగా ఇచ్చివెళతా అన్నాడు. అది కాదయ్యా బాబూ... మా ఇంటికి అసలు కరంటే లేదు. ఇది కరెంటు లేకుండా కూడా పని చేస్తుందా అందామె." అంతే చీపురెక్కడుందో చెప్పండాంటి అన్నాడు సేల్స్‌మన్.

\- ఎంకెఆర్



జనం మాట

పది చేతులు ఎత్తితే ప్రభంజనం అంటారు
పది గొంతుకలిచ్చితే విప్లవమని అంటారు
పది తంత్రులు మ్రోగితే స్వరకల్పన అంటారు
పదహారు వయసునే ప్రాయమని అంటారు
పోరాడి గెలిచేదే విజయమని అంటారు
పదుగురాడు మాటనే పాటించమంటారు
ప్రాణం అన్నింటికన్నా విలువైనది అంటారు
ప్రాబల్యం కోసమే ప్రయత్నిస్తూ ఉంటారు
ప్రాత:కాలపు మనసు ప్రశాంతమని అంటారు
పయనంలో గమ్యమే ముఖ్యమని అంటారు
పండువెన్నెలంతా ఆస్వాదిస్తుంటారు
ప్రకృతి అందాలనంతా ఆరాధిస్తుంటారు
ప్రపంచ గమనాన్ని ఎపుడు పరికించమంటారు
పడిలేచిన కెరటాలతో స్ఫూర్తి పొందమంటారు
ప్రతికూలతతో విజయం అద్భుతమేనంటారు

\- రాజమిత్ర

విజ్ఞాన వీచిక

ఎస్. వెంకట్రావు

> **మనిషికి వచ్చే రోగాల్లో 80 శాతం ఎటువంటి చికిత్స లేకండానే నయమైపోతాయి. దానికి కారణం మన శరీరంలో ఉండే సహజమైన రోగనిరోధక శక్తి. మిగిలిన రోగాల్లో కొంత శాతం (ఎంతశాతం అనేది కచ్చితంగా చెప్పడం కష్టం) ఏ మందుల వేసినా, ఎటువంటి చికిత్స చేసినా తగ్గవు. ఇవి పోను మిగిలిన జబ్బులకు మాత్రమే వైద్యం చేయాల్సిన అవసరం పడుతుంది.**

దీనికోసం ఏ వైద్యమైతే మంచిది? అల్లోపతా, హోమియోపతా, నేచురోపతా...అనే చర్చ అనంతంగా సాగిపోతోంది. మనకు అనేక రకాల వైద్యవిధానాలున్నాయి. అల్లోపతి, హోమియోపతిలతో బాటు, ఆయుర్వేదం, యునాని, సిద్ధ, ఆక్యుపంక్చర్, నాటువైద్యం... వగైరా. రోగాల నుండి కాపాడుకునేందుకు అనేక రకాల వ్యాయామ పద్ధతులు ఉన్నాయి. మామూలు వ్యాయామం, యోగా, లాఫింగ్ థెరపీ, ఆయిల్‌పుల్లింగ్, మంచినీళ్ల థెరపీ, ధ్యానం, ప్రకృతి వైద్యం...వగైరా. ఇవి కాకుండా రోగాలు రాకుండా ఉండడానికి, వచ్చిన రోగాలను నయం చేయడానికి కేవలం నమ్మకాలమీద చేసే వైద్యాలు కొన్ని ఉన్నాయి. వీటిలో అన్నిటికన్నా ముఖ్యమైనది రోగాల నుండి కాపాడమని దేవుణ్ణి మొక్కడం. దీనితో బాటు భూతవైద్యం, మంత్రాలు, తంత్రాలు, తాయెత్తులు, ఉంగరాలు, మూలికలు ధరించడం వగైరా... చాలా రకాలు న్నాయి.

ఉన్నవి రెండే వైద్యాలు

కాని నిజంగా ఇన్ని రకాల వైద్యాలున్నాయా అన్నదే ప్రశ్న. వైద్యశాస్త్ర చరిత్రను పరిశీలిస్తే మనకు ఇన్ని రకాల వైద్యాలు లేవని తెలుస్తుంది. ఉన్నవి రెండే రెండు వైద్యాలు, ఒకటి శాస్త్రీయ వైద్యం, రెండోది అశాస్త్రీయ వైద్యం. విజ్ఞాన శాస్త్రం అందించిన వైద్యం శాస్త్రీయమైంది. అంటే ఇది శాస్త్రం వల్ల నిరూపితమైన వైద్యం. వైద్యంలో ప్రధానమైన విభాగాలు- రోగనిర్ధారణ, చికిత్స. శాస్త్రీయ నిరూపణకు నిలిచే ఏ వైద్యమైనా శాస్త్రీయ వైద్యమే. నమ్మకాలకే మినహా శాస్త్ర నిరూపణకు నిలవని వైద్యం అశాస్త్రీయ వైద్యం. ఈ దృష్ట్యా చూసినప్పుడు పైన మనం చెప్పిన అనేక రకాల వైద్యవిధానాల్లో శాస్త్రీయమైనవీ ఉన్నాయి, అశాస్త్రీయమైనవీ ఉన్నాయి. ఏవి శాస్త్రీయమైనవి, ఏవి అశాస్త్రీయమైనవి అంటే వేరు చేసి పెట్టడం కూడా కష్టమే. ఎందుకంటే అశాస్త్రీయమైనవి అని మనం కొట్టి పారేసే చాలా వైద్య విధానల్లో ఎంతో కొంత శాస్త్రీయ అంశం ఉంటుంది. ఎందుకంటే చాలా వైద్య విధానాలు మానవుని తరతరాల అనుభవం నుండి, పరిశోధననుండి పుట్టినవే. అయితే అంతమాత్రం చేత అవన్నీ శాస్త్రీయ వైద్యవిధానాలని వాటినే నమ్ముకుని కూర్చుంటే అనేక ప్రమాదాలు కూడా వస్తాయి.

శాస్త్రీయత రీత్యా చూసినప్పుడు ఆధునిక వైద్యవిధానాన్ని మనం శాస్త్రీయ వైద్యంగా చెప్పవచ్చు. దీన్ని చాలా మంది "ఇంగ్లీషు వైద్యం" అని అంటున్నారు. నిజానికి ఆధునిక వైద్యం ఇంగ్లీషువారి సొంతం కాదు. అది మానవాళి మొత్తం యొక్క విజ్ఞానాన్ని మధించి, అభివృద్ధి చేసిన విధానం. ఫ్రెంచ్ శాస్త్రవేత్త లూయీ పాశ్చర్ పరిశోధనలు అంటువ్యాధులకు కారణమైన సూక్ష్మక్రిములు కనుగొనడానికి దారితీశాయి. ఇంగ్లీషు శాస్త్రవేత్తలతోబాటు, జర్మన్, అమెరికన్, ఇటాలియన్, రష్యన్ శాస్త్రవేత్తలు అనేకమంది ఆధునిక వైద్యంలో అనేక విషయాలు కనిపెట్టారు. ఆధునిక విజ్ఞానం యూరప్‌లో అభివృద్ధి చెందింది కనుక ఈ విజ్ఞానాన్ని ఆధారం చేసుకుని ఆధునిక వైద్యం కూడా అక్కడే ఎక్కువగా అభివృద్ధి చెందింది. ఇప్పటికీ అన్ని దేశాల్లో జరుగుతున్న పరిశోధనల సమాహారంగానే ఆధునిక వైద్యం అభివృద్ధి చెందుతోంది. మరి ఇతర వైద్య విధానాల సంగతేమిటి? ఇవన్నీ ఆయా సమాజాలు అభివృద్ధి పరుచుకున్న వైద్యవిధానాలు. ఆయుర్వేదం భారత్‌లో, హోమియో జర్మనీలో, ఆక్యుపంక్చర్ చైనాలో, యూనాని మధ్యప్రాచ్యంలో పుట్టాయి. ప్రతి సమాజంలోనూ మూలికా వైద్యం అంతర్భాగంగా ఉంటుంది. చివరికి ప్రాచీన గిరిజన తెగల్లో కూడా తమదైన మూలికా వైద్యవిధానం ఉంటుంది. అయితే ఇవన్నీ చాలా వరకు ట్రయల్ అండ్ ఎర్రర్ పద్ధతిమీద నడిచేవే. అనుభవం అధారంగా నిర్ధారించబడినవే. కనుక వీటిలో విజయాలూ, అపజయాలూ రెండూ ఉంటాయి.

ఏ వైద్యమైనా 80 శాతం రోగాలను నయం చేసేస్తుంది. ఎందుకంటే ఇంతకు ముందే చెప్పినట్లు ఆ 80 శాతం రోగాలు ఎటువంటి వైద్యం చేయక పోయినా మనలోని సహజమైన రోగనిరోధకశక్తి వల్ల నయమైపోతాయి. కొన్ని సందర్భాల్లో మనిషిలో రోగనిరోధక శక్తి తగిన మోతాదులో లేకున్నా రోగం వచ్చాక విశ్రాంతి తీసుకోవడం వల్లనైతేనేమి, సరైన ఆహారం ఇవ్వడం వల్లనైతేనేమి మందులతో నిమిత్తం లేకుండానే నయమైపోతాయి. వీటన్నిటినీ ఆయా మందులకు, చికిత్సా విధానానికి అపాదించడం పరిపాటి. కనుకనే అన్ని రకాల వైద్య విధానాలమీదా ప్రజలకు నమ్మకం అలాగే మిగిలిపోయింది. అల్లోపతి అయినా, ఆయుర్వేదమైనా, భూత వైద్యమైనా ఆ 80శాతం రోగాలకు సంబంధించినంతవరకు ఫలితం ఒక్కటే గనుక ప్రజలకు వాటిమీద నమ్మకాలు నిలిచిపోతాయి. సంప్రదాయ వైద్య విధానాలు ఈ 80 శాతం రోగాలతో బాటు ఇంకా అనేక రకాల రోగాలను నయం చేయవచ్చు గాని అవి పూర్తిగా శాస్త్రీయ వైద్యవిధానాలని మాత్రం చెప్పలేం. ఎందుకంటే వాటిలో రోగనిర్ధారణగాని, చికిత్సగాని శాస్త్రీయ పరిశోధనమీద అధారపడిలేదు. విజ్ఞానశాస్త్రం ఇంకా పూర్తిగా అభివృద్ధి చెందని కాలానికి చెందినవి అవి.

అన్నిటి సమాహారమే ఆధునిక వైద్యం

కాని ఆధునిక వైద్యం ఆ పాత వైద్యపద్ధతుల్లోని అన్నిరకాల శాస్త్రీయ అంశాలనూ తనలో ఇముడ్చుకుని అభివృద్ధి చెందింది. ఉదాహరణకు పసుపులోనూ, వేపలోనూ రోగనిరోధక శక్తి ఉందనేది మన పూర్వీకులు అనుభవం నుండి తెలుసుకున్న విషయం. ఇది నిజం కూడా. ఆధునిక విజ్ఞాన శాస్త్రవేత్తలు మొక్కల్లోని ఏఏ భాగాల్లో ఏఏ పదార్థాలు ఆ రోగనిరోధక పనిని చేస్తాయో తెలుసుకున్నారు. ఆ పదార్థాలను వెలికి తీసి చిన్న మాత్రల రూపంలో ఫ్యాక్టరీల్లో తయారు చేసి మందులుగా మనకు అందిస్తున్నారు. అలాగే పసుపు, వేపలోని ఈ రసాయనిక పదార్థాలు మన శరీరంలోకి ఎలా ప్రవేశించి, రోగక్రిములను ఎలా చంపుతాయో కూడా పరిశోధనలద్వారా తెలుసుకుంటున్నారు. అంటే శరీర ధర్మాన్ని గురించి తెలుసుకోవడం, అందులోని ప్రతి అవయవం, కణజాలం పనినిగురించి తెలుసుకోవడం, వాటి పనికి అవరోధం లేక హాని కలిగించే రోగాన్ని గురించి తెలసుకోవడం, ఆ రోగాన్ని ఎలా నివారించాలో (మందుల ద్వారానా, శస్త్రచికిత్స ద్వారానా) తెలుసుకోవడం పరిశోధన ద్వారా తేలుతుంది. ఇతర వైద్య విధానాల్లో ఈ పరిశోధనా భాగం ఏ మేరకైతే జరిగిందో దాన్నంతటినీ ఆధునిక వైద్యం స్వీకరించింది. అందువల్ల సంప్రదాయ వైద్యాలకున్న పరిమితులు ఆధునిక వైద్యానికి లేవు. అందుకనే ఏ మనిషి కూడా జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు ఆధునిక వైద్యం జోలికి పోకుండా సంప్రదాయ వైద్యంపైనే ఆధారపడలేరు. సర్వుల రోగాలు మటుమాయం చేసే బాబాలు, యోగులు, పోప్‌లు, బిషప్‌లు కూడా రోగం వస్తే ఆసుపత్రుల్లో చేరి చికిత్సచేయించుకున్న వాళ్లే.

కొత్త పుస్తకాలు

మన వాళ్లు చూసొచ్చిన చైనా గ్రామాలు

ప్రపంచచరిత్రలో రష్యా విప్లవం తరువాత చైనా విప్లవానికి మరెంతో ప్రాముఖ్యత ఉంది. రష్యా విప్లవం పారిశ్రామికంగా ఎదిగిన దేశపు విప్లవంగా ఓ మహత్తర అనుభవం. అలా పారిశ్రామికంగా అభివృద్ధి చెందకముందే అంటే వ్యవసాయదేశాల్లో విప్లవాల క్రమం, పంథా ఎలా ఉంటుందనేందుకు తిరుగులేని ఉదాహరణగా చైనా విప్లవం ఉంటుంది. మరందుకే మనలాంటి వ్యవసాయాధారిత దేశాలు చైనా దేశపు అనుభవాలవైపు ఓ విధమైన ఆతృతతో చూస్తాయి.

చైనా అనగానే అక్కడి గ్రామీణ వ్యవస్థ, దాని వికాసం ఎలా సాగిందనేది, ఇప్పుడెలా కొనసాగుతోందనేది చాలా ఆసక్తికరంగా ఉంటుంది. రష్యా పరిణామాలు, కమ్యూనిజంపై సామ్రాజ్యవాదుల దుష్ప్రచారం, ప్రపంచీకరణ–దాని ఆర్థికసామ్రాజ్యవాదం నేపథ్యంలో చైనా విప్లవ ఫలితాల సుస్థిరత గురించి చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ప్రపంచీకరణ, ప్రపంచబ్యాంకు షరతులు, సంస్కరణలు ఆయా దేశాల సౌభాగ్యాలకు ఎలాంటి పరిస్థితి ఎదురౌతోందని ఎంతో మంది పరిశీలిస్తున్నారు. చైనా సందర్శించిన సిపియం ప్రతినిధి బృందం అక్కడి గ్రామాలను పరిశీలించింది. ఆ బృందం పరిశీలనాంశాలను పుస్తకరూపంగా తిరుపతి వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ ఎన్ వేణుగోపాలరావు చాలా ఆసక్తికరంగా రాశారు.

సిపియం తన కేంద్ర నాయకత్వం నుంచి కొందరిని, ఆర్థిక వ్యవసాయ రంగానికి, ప్రజాసైన్స్ రంగానికి చెందిన కొందరిని ఎంపికచేసి ఒక బృందంగా చైనా పర్యటనకు పంపింది. ఈ బృందం చైనాలోని షాంఘై, బీజింగ్, హాంకాంగ్, టిబెట్, మంగోలియా లాంటి స్వయంపాలిత ప్రాంతాలతో పాటుగా ముప్పై ప్రావిన్సీలను కూడా సందర్శించివచ్చారు. ఆ పరిశీలనా బృందం అనుకోకుండా వారికున్న కార్యక్రమంలో లేని గ్రామం అయిన "యాంగ్‌షో" వెళ్లడం, ఆ గ్రామకార్యాలయం, ఒక మధ్యతరగతి వారి ఇల్లు సందర్శనా వివరాలు, మొత్తంగా ఆ గ్రామ స్వరూపం వర్ణన ఆ దేశ గ్రామీణ వ్యవస్థ మన కళ్ల ముందుంచుతుంది. మార్కెట్ ఆధారిత సోషలిజం పేరుతో సాగిన ఇటీవలి అభివృద్ధి క్రమం అనేకమందిలో పలు సందేహాలకు, చర్చకు దారితీసింది. మార్కెట్ ఎకానమీ ప్రకారం అమలయ్యే విధానాలు ప్రజల్ని మళ్లీ వర్గాలుగా విభజిస్తుందని, వాళ్ల మధ్య దూరం పెరుగుతుందని, ఆ పరిణామాలు నష్టకరంగానే ఉంటాయని భారత కమ్యూనిస్టు (మార్క్సిస్టు) పార్టీ, చైనా కమ్యూనిస్టు పార్టీవారికి తమ అభిప్రాయం చెప్పారు. అందుకే అక్కడ ఎలాంటి మార్పులు గ్రామీణవ్యవస్థలో చోటుచేసుకున్నాయో స్వయంగా పరిశీలించేందుకు రమ్మని చైనా ఆహ్వానించింది. ఆ ఆహ్వానం మేరకు ఈ బృందం పర్యటించిందని ఈ పుస్తకం ప్రచురించిన "ప్రజాశక్తి బుక్‌హౌస్" వారు పేర్కొన్నారు. ఆ రీత్యా ఈ పుస్తకం ద్వారా వ్యక్తమయిన ప్రత్యక్ష పరిశీలనాంశాలు ఎంతో విలువైనవి.

చైనా గ్రామీణ వికాసం

చైనా గ్రామీణ వికాసం- ఓ ప్రత్యక్ష పరిశీలన, రచన: ప్రొ. ఎన్ వేణుగోపాలరావు, పేజీలు: 44, వెల: రూ.15/-, ప్రతులకు: ప్రజాశక్తి అన్ని బ్రాంచీలు.

- శంకర్

స్వీకారం



సమాచార హక్కు చట్టం, 2005

ప్రథమ ముద్రణ 2006
వెల : 45/-
పేజీలు : 84
ప్రతులకు : అన్ని ముఖ్యమైన పుస్తక విక్రయ కేంద్రములలో లభించును

చెరువై పుట్టాలని...

వచన కవితలు :
వెల 25/-, పేజీలు : 40
ప్రతులకు :
రచయిత : డోర్ నెం. 4/96, లక్ష్మీనగర్, బందరు రోడ్, గుడివాడ-521 301, కృష్ణాజిల్లా.

గణిత విజ్ఞాన సర్వస్వం

సరైన గణితశాస్త్ర పరిజ్ఞానం లేని ఉపాధ్యాయుల వల్ల, విద్యార్థులకు గణితశాస్త్రంపై భయం పెరుగుతోంది. దీనికి కారణం యాంత్రిక బోధనాపద్ధతులు, కనీసావసరాల లేమి అని చెప్పొచ్చు. విద్యార్థికి ప్రాథమిక పాఠశాల నుండే గణితం పట్ల మక్కువ కలిగించాలి. అందుకు గాను సులువైన పద్ధతులను, మెళకువలను వారికి నేర్పాలి. అప్పుడే గణితం పట్ల వారికాసక్తి పెరుగుతుంది. విద్యార్థులలో అధ్యయనానైపుణ్యాన్నీ, గణితం పట్ల సరైన అవగాహననూ పెంచడానికి స్కూల్ అసిస్టెంటుగా తనకున్న అపారమైన అనుభవాన్ని రంగరించి మంజూర్ అలి ఈ పుస్తకాన్ని రూపొందించారు. గణితశాస్త్రంలోని మౌలిక భావనలను అర్థం గావించడానికి ఈ పుస్తకం తోడ్పడుతుంది. ఇందులో ప్రతిభావనను విపులంగా వివరించడానికి ప్రయత్నించారు. అలా గణితశాస్త్రానికి సంబంధించిన ప్రాథమిక విషయాలు, నిర్వచనాలు, సూత్రాలను లోపాలతో వివరించాలి. విద్యార్థులకు విస్తృతమైన అవగాహన కలిగించడానికి ఈ పుస్తకం తోడ్పడుతుంది. ఆరు నుండి 10వ తరగతి విద్యార్థులకు గణిత బోధనావగాహనలను పెంపొందించే దిశగా ఈ పుస్తకాన్ని రూపొందించారు. ఇది తెలుగులో ఉండటం విద్యార్థులకు కల్పతరువులాంటిది. ఇది స్కూలు విద్యార్థులకే కాకుండా జూనియర్ కాలేజీ స్థాయి విద్యార్థులకు, పోటీ పరీక్షలు రాసే విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.



గణిత విజ్ఞాన సర్వస్వం

(ప్రాథమిక విషయాలు, నిర్వచనాలు, సూత్రాలు- పటాలతో వివరణ) ఎం.డి. మంజూర్ అలి, ముద్రణ మరియు ప్రతులకు విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్ వెల 100/- పేజీలు 270.

- కె.పి. అశోక్ కుమార్

బీట్‌రూట్ స్వీట్ పూరీ

కావలసిన వస్తువులు

బీట్‌రూట్	:	పావు కిలో
బొంబాయి రవ్వ	:	అర కిలో
పాలు	:	అర లీటరు
మైదాపిండి	:	పావు కిలో
పంచదార	:	పావు కిలో
నెయ్యి	:	నాలుగు టేబుల్ స్పూన్లు
ఏలకులు	:	10

తయారుచేసే విధానం

బీట్‌రూట్ శుభ్రంగా కడిగి పైన తొక్కల్ని తీసివేసి చిన్న చిన్న ముక్కలుగా కోయాలి. ఈ ముక్కలలో పాలు పోసి కుక్కర్లో పెట్టి మెత్తగా ఉడికించాలి. దీన్ని మిక్సీలో వేసి మెత్తగా చేసుకోవాలి. బొంబాయి రవ్వను కొద్దిగా నెయ్యి వేసి దోరగా వేయించుకోవాలి. మైదా పిండిని శుభ్రంగా జల్లించుకొని దానిలో మిక్సీ వేసిన పంచదార పొడిని కలపాలి. బీట్‌రూట్ మిశ్రమంలో బొంబాయి రవ్వ, ఏలకుల పొడి కలపాలి. దీనిని పూరీ పిండిలాగా గట్టిగా కలుపుకోవాలి. ఈ పిండిని చిన్న చిన్న ఉండలుగా చేసుకొని పూరీలుగా వత్తుకోవాలి. వీటిని దోరగా వేయించుకోవాలి. వేడివేడిగా తింటే చాలా రుచిగా ఉంటాయి.

హాట్ కాజాలు

కావలసిన వస్తువులు

మైదాపిండి	:	ఒక కిలో
నూనె	:	ఒక కిలో
డాల్డా	:	పావు కిలో
జీలకర్ర	:	50 గ్రాములు
మిరియాలు	:	10 గ్రాములు
పచ్చిమిర్చి	:	50 గ్రాములు
అల్లం	:	50 గ్రాములు
నువ్వులు	:	వంద గ్రాములు
వాము	:	50 గ్రాములు
కారం	:	ఒక స్పూను
ఉప్పు	:	తగినంత

తయారుచేసే విధానం

మైదాపిండిని శుభ్రంగా జల్లించుకోవాలి. నువ్వులు, జీలకర్ర, వాము రాళ్ళు లేకుండా శుభ్రం చేసుకోవాలి. అల్లం, పచ్చిమిర్చి మిక్సీలో మెత్తగా రుబ్బుకోవాలి. మిరియాలు పొడి కొట్టుకోవాలి. డాల్డా వేడి చేసి మైదాపిండిలో కలపాలి. అల్లం, పచ్చిమిర్చి, ఉప్పు, మిరియాలపొడి, జీలకర్ర, వాము, నువ్వులు అన్నీ పిండిలో వేసి కలపాలి. వీటిని చపాతీలాగా వత్తాలి. దీనిని డైమండ్ ఆకారంలో కోసుకోవాలి. నూనెలో వేయించుకోవాలి. ఇవి కరకరలాడుతూ నోటికి ఎంతో రుచిగా ఉంటాయి. ఇవి వారం పదిరోజులు నిల్వ ఉంటాయి.

ఒంటె - వ్యాపారులు

చూటీ

అరేబియాలో ఇద్దరు వ్యాపారులు వుండేవారు. వారికి ఓ ఒంటె కూడా వుండేది. వారు ఓసారి ఎడారిలో ప్రయాణిస్తుండగా అది తప్పిపోయింది. తమకు ఎంతో సాయంగా వుండే ఒంటె కనిపించకపోవడంతో పాపం వారు ఎంతగానో బాధపడ్డారు. దానికోసం వెతకసాగారు.

దారిలో వారికి ఓ వృద్ధుడు కనిపించాడు. వెంటనే ఇద్దరూ తమ ఒంటె గురించి అతనిని అడిగారు. అప్పుడు వృద్ధుడు వారిని కొన్ని ప్రశ్నలు వేశాడు.

'ఒంటె బాగా ముసలిదా?'

'అవును'.

'అది ఒక కాలు కుంటుతుందా?'

'అవును'.

'దాని కుడి కన్ను గుడ్డిదా?'.

'అవునుగానీ. నువ్వు దాన్ని చూశావా?' అని అడిగారు వ్యాపారులు ఆశ్చర్యంగా.

ఆ ప్రశ్నకు సమాధానం చెప్పకుండానే 'ఒంటె వీపుకు ఒకవైపున గోధుమలు వున్నాయా?' అనడిగాడు వృద్ధుడు.

దాంతో తమ ఒంటెను వృద్ధుడు చూసే వుంటాడనుకుంటూ... 'అవును' అన్నారు వ్యాపారులు.

'ఒంటె వీపుకు మరోవైపున తేనె వున్నదా?' అని మళ్లీ ప్రశ్నించాడు వృద్ధుడు.

దాంతో వ్యాపారులకు విపరీతమైన కోపం వచ్చింది. వృద్ధుణ్ణి పట్టుకుని గట్టిగా ఊపుతూ 'నువ్వు ఒంటెను చంపేసి సరకు తీసుకున్నావా ఏంటి?' అన్నారు తీవ్రమైన స్వరంతో.

దానికి వృద్ధుడు 'నేను మీ ఒంటెను చూడనేలేదు' అన్నాడు శాంతంగా.

'నువ్వు చెప్పే కథలు వినడానికి మేమేమన్నా చవట దద్దమ్మల్లాగా కనిపిస్తున్నామా?' అంటూ అతడిని న్యాయమూర్తి దగ్గరకు లాక్కుపోయారు.

వ్యాపారులు చెప్పినదంతా విన్నాడు న్యాయమూర్తి. తర్వాత వృద్ధుడి వైపు తిరిగి ఒంటెను ఎక్కడ చూశావని అడిగాడు. దానికి అతను తాను ఒంటెను అస్సలు చూడనేలేదన్నాడు. అప్పుడు న్యాయమూర్తి 'మరి ఒంటె ఒక కాలు కుంటుతుందని ఎలా చెప్పగలిగావు?' అని ప్రశ్నించాడు.

'నేను ఇసుకలో దాని పాద ముద్రలు చూశాను. వాటిలో ఒక పాద ముద్ర చాలా అస్పష్టంగా కనిపించింది. అందుకే అలా అనుకున్నాను' అని చెప్పాడు వృద్ధుడు.

'మరి దానికి ఒక కన్ను కనపడదని ఎలా తెలిసింది?' అన్నాడు న్యాయమూర్తి నవ్వుతూ.

'ఒంటె రోడ్డుకి ఒకవైపున వున్న చెట్ల ఆకులను మాత్రమే తింది. అందుకే అది ఒక వైపు చూడలేదని తెలుసుకున్నాను' అన్నాడు వృద్ధుడు.

'మరి ఒంటె వీపుమీద గోధుమలు, తేనె వున్నాయని ఎలా తెలిసింది?' అని ప్రశ్నించాడు న్యాయమూర్తి కుతూహలంగా.

'రోడ్డుమీద అక్కడక్కడా రాలిన గోధుమ గింజలను చీమలు మోసుకెళ్లడం చూశాను'... అని చెప్తుండగానే... న్యాయమూర్తి కలుగచేసుకుని 'రెండోవైపున తేనెటీగలు ఎగురుతూ కనిపించాయా?!!' అన్నాడు.

'సరిగ్గా అంతేనండీ' అన్నాడు వృద్ధుడు ఎంతో నిజాయితీగా.

దాంతో న్యాయమూర్తి వ్యాపారులవైపు తిరిగి 'ఈ వృద్ధుడు తన కళ్లను, తెలివితేటలను వుపయోగించి మీ ఒంటె ఎలా వుంటుందో చెప్పగలిగాడు. మీకు కూడా కళ్లున్నాయి. తెలివితేటలున్నాయి. వాటిని వుపయోగించి మీ ఒంటె ఎక్కడుందో తెలుసుకోండి' అని పంపేశాడు.

వృద్ధుడు వాటన్నిటినీ తన జ్ఞాన నేత్రంతో చూడగలిగాడని వారికి అప్పుడర్థమైంది.